మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDDAY 3-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 154 Issue: 154

03 డిసెంబర్ 2025 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:35 సూర్యాస్తమయం - సా. 5:36 తిథిః త్రయోదశి మ. 12:24 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం భరణి సా. 5:56 వరకు తరువాత కృతిక యోగం పరిఘ సా. 4:49 వరకు కరణం తైతుల మ. 12:24 వరకు గరజి రా. 10:31 వరకు వర్జ్యం తె. 4:27 నుండి తె. 5:51 వరకు దుర్ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:27 వరకు రాహుకాలం మ. 12:05 నుండి మ. 1:28 వరకు యమగండం ఉ. 7:57 నుండి ఉ. 9:20 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:05 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:59 నుండి తె. 5:47 వరకు అమృత ఘడియలు మ. 1:45 నుండి మ. 3:10 వరకు అభిజిత్ ముహూర్తం లేదుజ గమనిక: "ం" అనగా మరుసటి రోజున


Published from Jagitial
www.evarthalu.com




## రాజ్‌భవన్ ఇక లోక్‌భవన్

### పేర్లు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఉత్తర్వులు తరువాయి 2 వ పేజీలో...



## పీఎంవో ఇక సేవా తీర్థ్

### నూతన కాంప్లెక్స్‌కు కొత్త పేరు

వలసవాద గుర్తులను చెరిపేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'లుగా మార్చిన కేంద్రం, తాజాగా ప్రధానమంత్రి కార్యాలయ (పీఎంవో) నూతన కాంప్లెక్స్‌కు కూడా కొత్త పేరును ఖరారు చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఈ భవన సముదాయానికి 'సేవా తీర్థ్' అని నామకరణం చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరించే 'ప్రజలే ప్రథమం' అనే విధానానికి, నిస్వార్థ సేవకు ప్రతీకగా ఈ పేరును ఎంపిక చేశారు.

న్యూఢిల్లీ: నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఈ కాంప్లెక్స్‌లో పీఎంవోతో పాటు కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఉంటాయి. ప్రపంచ నేతల తో ఉన్నత స్థాయి సమావేశాల కోసం 'ఇండియా హౌస్' కూడా దీనిలో భాగంగా ఉంటుంది. గత కొద్ది రోజు లుగా ఉత్తరాఖండ్, కేరళ, త్రిపుర, పశ్చి మ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని తరువాయి 2 వ పేజీలో...

## ఎస్పీ బాలు విగ్రహం ఇక్కడెందుకు?

**ఇది తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి విరుద్ధం**

**తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్**



రవీంద్రభారతి/హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ లోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన రవీంద్రభారతి ప్రాంగణంలో గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటు తీవ్ర వివాదానికి దారితీసింది. డిసెంబర్ 15న ఎస్పీబీ జయంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తుండగా, తెలంగాణవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కళకు ప్రాంతీయ హద్దులు లేవని ఒక వర్గం వాదిస్తుండగా, ఇది తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వాన్ని -2 వ పేజీలో...

## హిల్ట్‌పై.. కారు పోరు!

**పారిశ్రామిక వాడల్లో బీఆర్ఎస్ పర్యటనలు**

### సీనియర్లతో 8 నిజనిర్ధారణ బృందాలు.. నేడు, రేపు ఆయా ప్రాంతాల్లో పరిశీలన



'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ(హిల్ట్)' పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. దీనిలో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' ఏర్పాటు చేశారు.

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు. రూ. 5 లక్షల కోట్ల కుంభకోణం నిజానిజాన్ని ప్రజల ముందు ఉంచాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం తరువాయి 2 వ పేజీలో...



### ఖమ్మం పదేళ్లు పడావు

## జిల్లాను నేను అభివృద్ధి చేస్తా

### తెలంగాణ కలను తీర్చింది మన్మోహన్

**ఆయన పేరే ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి.. కొత్తగూడెంలో సీఎం రేవంత్ వెల్లడి**

తెలంగాణ ఉద్యమానికి పునాది పడింది పాల్వంచలోనే. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్. మన్మోహన్ సింగ్ పేరును వర్శిటీకి పెట్టుకోవడం గర్వకారణం. దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. – సీఎం రేవంత్ రెడ్డి

2

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,987 |
| వెండి (గ్రాము): | రూ.196 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,780 |

## పవన్ తలతిక్కోడు

### వెంటనే తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: వాకిటి

### సారీ చెప్పకపోతే సినిమాలు ఆడనివ్వం: కోమటిరెడ్డి



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి తీవ్రంగా స్పందించారు. రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్న 'తలతిక్క మాటలు' వెంటనే మానుకోవాలని, లేకపోతే తెలంగాణలో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా పవన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే తెలంగాణలో ఆయన సినిమాలను ఆడనివ్వబోమని హెచ్చరించారు. 'పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు నన్ను తీవ్రంగా తరువాయి 2 వ పేజీలో...


## తూచ్.. వక్రీకరించారు!

### పవన్ వ్యాఖ్యలపై జనసేన ప్రకటన



ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. రాజోలు నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారని ఆ ప్రకటనలో జనసేన పేర్కొంది.

మంగళగిరి, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న తరుణంలో ఇలా మాటలను వక్రీకరించవద్దని విజ్ఞప్తి చేసింది. ఇటీవల రాజోలు నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి తగలడం వల్లనే కొబ్బరితోటలు ఎండిపోయాయని వ్యాఖ్యానించారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ నాయకులు తరువాయి 2 వ పేజీలో...



## 9న 'సర్'పై చర్చ

### ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)' పై లోక్‌సభ లో చర్చించేందుకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజుజు మీడియాకు వెల్లడించారు. డిసెంబర్ 8న వందేమాతరం గీతంపై, డిసెంబర్ 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగానే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కూడా చర్చించనున్నారు. కాగా పార్లమెంటు శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజే 'సర్'పై చర్చించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ ఆందోళనల తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా శాస్త్రవేత్తలు అద్భుతం చేశారు. కీమో, రేడియేషన్ అవసరం లేకుండానే.. కేవలం కేన్సర్ వ్యాక్సిన్‌తోనే బ్రెయిన్ ట్యూమర్ గడ్డలను తొలగించగలిగారు. ప్రస్తుతం మనుషులపై ప్రయోగాలు జరుపుకుంటున్న ఈ వ్యాక్సిన్.. విజయవంతమైతే కోట్ల మంది ప్రాణాలను కాపాడవచ్చని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## హరీశ్ చేతిలో బీజేపీ రిమోట్

### కమలం నేతలు కీలుబొమ్మలయ్యారు

### కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో త్వరలో పెను సంచలనం జరగబోతోం దంటూ టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా తరువాయి 2 వ పేజీలో...




## మోదీ బలం రాహుల్

### పెద్ద మొద్దులా రాహుల్ నాయకత్వం.. ఇగ్నిషన్ సదస్సులో కేటీఆర్

చెన్నై: కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంగా తీవ్రంగా విఫలమైందని.. రాహుల్‌గాంధీ నాయకత్వమే మోదీకి బలంగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. చెన్నైలో మంగళవారం నిర్వహించిన శివ్ నాడార్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మక ఇగ్నిషన్ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సదస్సులో రీ బూటింగ్ ది రిపబ్లిక్ అనే అంశంపై కేటీఆర్ తన అభిప్రాయాలు పంచుకున్నారు. దేశాభివృద్ధిలో రాజకీయాలు, టెక్నాలజీ పాత్ర, ఇన్నోవేషన్ తరువాయి 2 వ పేజీలో...



## బెంగాల్‌లో 43 లక్షల ఓటర్లు ఔట్

**చనిపోయిన, వలస వెళ్లినవారే అధికం**

3

## రాశి ఫలాలు

3.12.2025

మేషం: మాతృ సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. రావలసిన ధనం చేతికందడంలో ఆలస్యం అవుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో చర్చలు ఫలించవు.

వృషభం: చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తి చేస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. ధన వ్యవహారాలలో ఆశించిన ఫలితాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో సోదరుల సహాయ సహకారాలు అందుతాయి.

మిధునం: వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహమున కొందరు మాటలు మానసికంగా చికాకు పరుస్తాయి. ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. గృహ నిర్మాణ పనులు మందకొడిగా సాగుతాయి. బంధు మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి.

కర్కాటకం: దూరప్రయాణాలు లాభదాయకంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. ఉద్యోగమున అనుగ్రహం పొందుతారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

సింహం: ఉద్యోగమున అదనపు పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది.

కన్య: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది. గృహమున సంతాన వివాహ విషయమైన ప్రస్తావన వస్తుంది. కొన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి.

తుల: నిరుద్యోగులు కొంత కష్టం మీద నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వృత్తి, ఉద్యోగాలలో ఓర్పుతో వ్యవహరించాలి. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు కార్యరూపం దాలుస్తాయి. ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది.

వృశ్చికం: కుటుంబ సభ్యుల మధ్య అవగాహన లోపించి మనస్పర్ధలు కలుగుతాయి. నిరుద్యోగులకు ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో కొన్ని విషయాల గురించి చర్చిస్తారు. చేపట్టిన పనులలో ఆటంకాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు.

ధనస్సు: ఉద్యోగమున సహోద్యోగులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. దాయాదులతో స్థిరాస్తి తగాదాలు ఉంటాయి. సంతానం విద్యా విషయాల నిరుత్సాహపరుస్తాయి. దైవ సేవా కార్యక్రమాల పట్ల ఆశక్తి పెరుగుతుంది.

మకరం: భూ క్రయ విక్రయాలు నిరుత్సాహపరుస్తాయి. జీవిత భాగస్వామి ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. ఒక వ్యవహారంలో సోదరులతో విభేదిస్తారు. ఉద్యోగాల్లో ఇతరుల నుండి విమర్శలు తప్పవు. వృధా ఖర్చులను అదుపులో పెట్టుకోవాలి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తికావు.

కుంభం: సంఘంలో విశేషమైన ఆదరణ పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో సఖ్యతగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఇతరుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు.

మీనం: భూ సంభందిత వ్యవహారాలలో తగాదాలు చికాకు పరుస్తాయి. సంతానంతో మాట పట్టింపులుంటాయి. వృత్తి ఉద్యోగాలు మిశ్రమ ఫలితాలుంటాయి. దైవ సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఆర్థిక లావాదేవీలు సామాన్యంగా సాగుతాయి. వ్యాపారాలలో భాగస్తులు నుండి ఒత్తిడి పెరుగుతుంది.

# హిల్ట్‌పై..కారు పోరు!

**మొదటి పేజీ తరువాయి**

చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి. డిసెంబర్ 03, 04 తేదీలలో హిల్ట్ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి.

- క్లస్టర్-1లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావ్ నేతృత్వంలో ఎమ్మెల్యే గంగుల, దేశపతి శ్రీనివాస్ మరియు మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శిస్తారు.
- క్లస్టర్-2లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు.
- క్లస్టర్-3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, మర్రిరాజశేఖర్ రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్ రావు మౌలాలి మరియు కుషాయిగూడ పారిశ్రామిక వాడలను విజిట్ చేస్తారు.
- క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి,కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావుతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.
- క్లస్టర్-5లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని యాదవ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు.
- క్లస్టర్-6లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు.
- క్లస్టర్-7లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి కాటేదాన్ మరియు హయత్ నగర్ లో పర్యటిస్తారు.
- చివరగా క్లస్టర్-8లో మాజీ మంత్రి మహముద్ అలీ, శ్రవణ్ దాసోజ ఎండీ సలీం చందులాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.

# ఎస్పీ బాలు విగ్రహం ఇక్కడెందుకు?

**మొదటి పేజీ తరువాయి**

దెబ్బతీయడమేనని మండిపడుతున్నారు. తెలంగాణ సాంస్కృతిక కేంద్రంగా పేరొందిన రవీంద్రభారతిలో కేవలం తెలంగాణకు చెందిన ప్రముఖుల విగ్రహాలే ఉండాలని తెలంగాణ ఉద్యమకారుడు పృథ్వీరాజ్ వాదిస్తున్నారు. ఏపీకి చెందిన ఎస్పీ బాలు విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 'తెలంగాణ గడ్డపై ప్రజాకవి గద్దర్, ప్రముఖ కవి అందెశ్రీ వంటి మహానుభావులకు దక్కాల్సిన గౌరవం ముందు దక్కాలి. ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారి విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేయడానికి మేం అంగీకరించబోం' అని పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన అనుచరులతో కలిసి విగ్రహ ఏర్పాటు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ బాలు కుటుంబ సభ్యుడు, ప్రముఖ నటుడు శుభలేఖ సుధాకర్ రవీంద్రభారతికి చేరుకుని పృథ్వీరాజ్‌కు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. కళాకారులను ప్రాంతాల వారీగా చూడటం సరికాదని, సంగీతానికి, కళకు హద్దులు ఉండవని సుధాకర్ పేర్కొన్నారు. కాగా, కొన్నిరోజుల కిందటే శుభలేఖ సుధాకర్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఆ సందర్భంగా ఎస్పీ బాలు విగ్రహ ఏర్పాటుపై చర్చించినట్లు సమాచారం.

# జిల్లాను నేను అభివృద్ధి చేస్తా

**తెలంగాణ కలను తీర్చింది మన్మోహన్**
**ఆయన పేరే ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి**
**కొత్తగూడెంలో సీఎం రేవంత్ వెల్లడి**

కొత్తగూడెం, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా గత పదేళ్లు పడావు పడిందని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను తాము పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో మాజీ ప్రధాని డాక్టర్ న్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి శంకుస్థాపన అనంతరం సీఎం సభలో మాట్లాడారు. తెలంగాణ సాకారం చేసిన మన్మోహన్ సింగ్ పేరును దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి పెట్టుకోవడం గర్వకారణమని అన్నారు. కీలకమైన మంత్రి పదవులు ఖమ్మం జిల్లా నేతల దగ్గరే ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమానికి పునాది పడింది పాల్వంచలోనేనని తెలిపారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచ పటంలో తెలంగాణ రాష్ట్రాన్ని నిలబెడుతున్నాయని వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారని గుర్తు చేశారు. ఖమ్మం మంత్రుల చేతుల్లోనే పాలనకు ఆయువుపట్టయిన శాఖలు ఉన్నాయని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. పథకాలు అందాలంటే సర్పంచ్‌లు మంచివాళ్లు ఉండాలని పేర్కొన్నారు. దేశంలోనే అత్యున్నతమైన వర్సిటీ ఇదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎర్త్ సైన్సెస్ వర్సిటీ అనేది దేశంలో ఎక్కడా లేదని అన్నారు. అద్భుతమైన వర్సిటీకి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారని, మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీ దేశానికే తలమానికమని కొనియాడారు. వీలైనంత త్వరగా వర్సిటీ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మన్మోహన్ సింగ్ పేరుతో ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ఇచ్చిన ముఖ్యమంత్రికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని కొనియాడారు. గత ప్రభుత్వం మన్మోహన్ సింగ్ పేరుతో ఒక్క పథకం కూడా పెట్టలేదని విమర్శించారు. మీ దీవెనలు ఇందిరమ్మ ప్రభుత్వంపై ఎప్పుడూ ఉండాలని కోరారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేస్తున్న ఎర్త్ సైన్సెస్ వర్సిటీ భూవిజ్ఞాన శాస్త్రంలో పరిశోధనలు, ఆవిష్కరణలకు ఊతమివ్వనున్న వర్సిటీ స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉన్నారు.

### నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు తెలంగాణ సర్కార్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 4 వేల మందికిపైగా ప్రముఖులను ఆహ్వానిస్తోంది. అయితే దేశ ప్రధాని మోదీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీలను కూడా ఆహ్వానించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఖర్గే, రాహుల్ గాంధీలకు ఆహ్వానం పలికిన తర్వాత ఆయన బుధవారం మధ్యాహ్నానికి హైదరాబాద్‌కు తిరిగి వస్తారని సమాచారం.

# పవన్ తలతిక్కోడు

**మొదటి పేజీ తరువాయి**

బాధించాయి. తెలంగాణ ప్రజల దిష్టి వల్ల కాదు, గత ఆంధ్ర పాలకుల వల్లే ఇక్కడి ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగారు. ఈ విషయం తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి. లేదంటే, సినిమాటోగ్రఫీ మంత్రిగా చెబుతున్నా.. తెలంగాణలోని ఒక్క థియేటర్‌లో కూడా ఆయన సినిమా విడుదల కాదు' అని స్పష్టం చేశారు. పవన్ కామెంట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా మండిపడ్డారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి రెండు రాష్ట్రాల మధ్య సౌహార్ద వాతావరణాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. 'మీ సముద్రం నుంచి వచ్చే తుపాను మా రాష్ట్రాన్ని ముంచేస్తున్నా మేమెవరినీ తప్పుబట్టలేదు. అది ప్రకృతి అని భావించాం. కానీ డిప్యూటీ సీఎం స్థాయిలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడతారా? కోనసీమపై మేమెందుకు దిష్టి పెడతాం?' అని నిలదీశారు.

## తూచ్.. వక్రీకరించారు!

**మొదటి పేజీ తరువాయి**

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని తెలంగాణ నాయకుల నుంచి డిమాండ్లు వినిపించాయి. ఈ క్రమంలో జనసేన నుంచి ఈ ప్రకటన వెలువడింది.

# మోదీ బలం రాహుల్

**మొదటి పేజీ తరువాయి**

హబ్‌ల ఆవశ్యకత, సమ్మిళిత ఆర్థికాభివృద్ధిపై తన ఆలోచనలను పంచుకున్నారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఒక ఎజెండాను, ఒక మోడల్‌ను దేశానికి అందించడంలో దేశంలోనే అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ విఫలమైందన్నా రు. నెహ్రూ, ఇందిరాగాంధీ తర్వాత దేశంలో కాంగ్రెస్ పార్టీ సాధించింది ఏమీ లేదని, రాహుల్‌గాంధీకి దేశ భవిష్యత్తుపై విజన్ లేదని అన్నారు. దేశంలోని ఆర్థిక వ్యవస్థపై, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై, ఇన్నోవేషన్‌పై, పారిశ్రామిక ప్రగతిపై రాహుల్ గాంధీ భవిష్యత్తు గురించి మాట్లాడడం ఏనాడూ చూడలేదని అన్నారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం బీజేపీని ఎదుర్కోవడం కష్టమని, ఆ పని కేవలం ప్రాంతీయ పార్టీలకే సాధ్యం అవుతుందని చెప్పారు. బిహార్ వంటి రాష్ట్రాల్లో తోక పార్టీ లాంటి కాంగ్రెస్.. అనేక స్థానాల్లో పోటీ చేస్తామని మొండికి వేయడం వల్లనే బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూరిందన్నారు. గతంలో కేసీఆర్ ప్రాంతీయ పార్టీల వేదిక ఒకటి ఏర్పాటు చేసి దేశానికి ప్రత్యామ్నాయ నమూనాను అందించాలని ప్రయత్నం చేశారని, దురదృష్టవశాత్తు అది ముందుకు పోలేదన్నారు. దేశంలోని ప్రతిపక్షం మెడలో కట్టిన పెద్ద మొద్దు లెక్కన రాహుల్ గాంధీ నాయకత్వం తయారైందన్నారు. ఎన్నికల ప్రచారానికి రాహుల్ గాంధీ వచ్చినప్పుడు లక్ష కోట్ల ప్రాజెక్ట్ వ్యయం లేని కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని మాట్లాడడం అయన అజ్ఞానానికి నిదర్శం అన్నారు. దక్షిణాన బీజేపీకి భవిష్యత్తు ఉందని అనుకోవడం లేదని.. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు తిరస్కరించి బలమైన పాఠం చెప్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బీజేపీ పదేళ్లలో విభజన రాజకీయాలను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లిందని, అయితే బీజేపీ విభజన రాజకీయాలను ఎండగట్టడంలో ప్రతిపక్షాలుగా తాము విఫలం అయ్యామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. పదేళ్లపాటు అనేక రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక ప్రగతి అద్భుతంగా సాధించిన తెలంగాణ రెండేళ్లలో వెనుకబడడం బాధాకరమన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునాతనమైన టెక్నాలజీలను అందుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇన్నోవేషన్ రంగానికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. అందుకే టీ-వర్క్స్ వంటి అనేక కొత్త సంస్థలను ఏర్పాటు చేశామని.. మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం ఉద్యోగాలపైన స్వల్పకాలమే ఉంటుందని చెప్పారు. పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా ఉద్యోగ అర్హతలు కలిగిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను కాలేజీలలో తయారు చేసుకోవడం, ఆ దిశగా కరికులమ్, శిక్షణ వంటి అంశాలను ఎప్పటికప్పుడు మార్చుకోవడమే అతిపెద్ద సవాల్ అని పేర్కొన్నారు.

## పీఎంవో ఇక సేవా తీర్థ్

**మొదటి పేజీ తరువాయి**

రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'గా మార్చిన విషయం తెలిసిందే. ఈ పరంపరలోనే పీఎంవోకు కూడా కొత్త పేరు పెట్టారు. గతంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రధాని నివాసం ఉండే రేస్ కోర్స్ రోడ్డును 'లోక్ కల్యాణ్ మార్గ్'గా, చారిత్రక రాజ్‌పథ్‌ను 'కర్తవ్య పథ్'గా, సెంట్రల్ సెక్రటేరియట్‌ను 'కర్తవ్య భవన్'గా మార్చింది. 'రాజ్' (పాలన) స్థానంలో 'సేవ', 'కర్తవ్యం', 'లోక్' (ప్రజలు) వంటి భావనలకు ప్రాధాన్యమిస్తూ పాలనా కేంద్రాలకు కొత్త పేర్లు పెడుతున్నారు. అధికారం కాకుండా బాధ్యత, సేవకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న సందేశాన్ని ఈ మార్పుల ద్వారా స్పష్టం చేస్తున్నారు.

## 9న 'సర్'పై చర్చ

**మొదటి పేజీ తరువాయి**

మధ్య సభ మంగళవారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ ఇదే అంశంపై చర్చకు విపక్షం పట్టుబట్టి చివరకు వాకౌట్ చేసింది. చర్చకు తాము విముఖం కాదని, అయితే కాలపరిమితిని నిర్దేశించాలనుకోవడం తగదని అధికారపక్షం పేర్కొంది. రెండోరోజు సమావేశాల్లోనూ అదే పరిస్థితి తలెత్తడంతో స్పీకర్ ఓం బిర్లా అఖిలపక్ష సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు అధికారపక్షం చర్చకు అంగీకరించింది. అయితే ప్రత్యేకంగా 'సర్'పై కాకుండా ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనుంది.

## రాజ్‌భవన్ ఇక లోక్‌భవన్

**మొదటి పేజీ తరువాయి**

జారీ చేసింది. వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా, రాజ్‌భవన్, రాజ్‌నివాస్ పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌గా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అందుకు అనుగుణంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాలు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశాయి.

## హరీశ్ చేతిలో బీజేపీ రిమోట్

**మొదటి పేజీ తరువాయి**

వేడెక్కాయి. హరీశ్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలుబొమ్మలుగా మారిపోయారని సామ విమర్శించారు. ఇకపై కేటీఆర్ కార్యక్రమాల కంటే ఎక్కువగా హరీశ్ రావు కార్యక్రమాలకు ప్రచారం కల్పించేలా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. హరీశ్ రావు, ఈటల రాజేందర్ పన్నిన వ్యూహంలో బీజేపీ చిక్కుకుపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. సామ రామ్మోహన్ రెడ్డి తాజా వ్యాఖ్యలతో హరీశ్ రావు బీజేపీలో చేరతారనే ఊహాగానాలకు మరోసారి బలం చేకూరినట్లయింది. గతంలో కూడా పలుమార్లు ఆయన పార్టీ మారతారని ప్రచారం జరిగింది. అయితే, ఆ వార్తలను హరీశ్ రావు ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం బీఆర్ఎస్‌లోనే ఉంటానని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇటీవల బీఆర్ఎస్ నుంచి సస్పెండైన ఎమ్మెల్సీ కవిత కూడా హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. హరీశ్ బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారని ఆమె పరోక్షంగా సూచిస్తూ, ఆయన విషయంలో కేసీఆర్, కేటీఆర్ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# బెంగాల్‌లో 43 లక్షల ఓటర్లు ఔట్

### చనిపోయిన, వలస వెళ్లినవారే అధికం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా భారీ సంఖ్యలో పేర్లను తొలగించేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సిద్ధమైంది. బూత్-స్థాయి అధికారులు (బీఎల్ఓ) సేకరించిన ఫారాల డిజిటైజేషన్ సరళిని బట్టి, సుమారు 43.30 లక్షల పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి మినహాయించనున్నట్లు ఈసీఐ అంచనా వేసింది. ఈ ముసాయిదా జాబితాను ఈ నెల 16న ప్రచురించనున్నారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయ వర్గాల ప్రకారం సోమవారం సాయంత్రం వరకు జరిగిన డిజిటైజేషన్ ఆధారంగా ఈ అంచనా వేశారు. ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 27 నాటికి బెంగాల్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7,66,37,529గా ఉంది. తొలగించనున్న 43.30 లక్షల పేర్లలో అత్యధికంగా 21.45 లక్షల మంది మరణించిన ఓటర్లు ఉన్నారు. సుమారు 15.10 లక్షల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు కాగా, 5.5 లక్షల మంది ఆచూకీ లభించని వారుగా గుర్తించారు. బోగస్ లేదా నకిలీ ఓటర్ల సంఖ్య లక్ష కంటే తక్కువగా ఉన్నట్లు తేలింది. అయితే, రాష్ట్రంలోని 2,208 పోలింగ్ బూత్‌లలో మరణించిన, నకిలీ లేదా వలస వెళ్లిన ఓటరు ఒక్కరూ లేరని గుర్తించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇన్ని బూత్‌లలో ఒక్క లోపం కూడా లేకపోవడంపై బీజేపీ అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ బూత్‌ల నుంచి సేకరించిన ఫారాలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేసింది. ఈ అంశంపై బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి స్పందించారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో కేవలం మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో 1.25 కోట్ల ఫారాలు నమోదు కావడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఆ మూడు రోజుల్లో నమోదైన ఫారాలపై ఆడిట్ నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.



# అది రాజగోపాల్ రెడ్డి రాజ్యం!





**మునుగోడులో ఊరిబయటే వైన్స్**

**మధ్యాహ్నం తర్వాతే అమ్మకాలు**

**సాయంత్రం 6 తర్వాతే పర్మిట్ రూమ్స్**


మునుగోడు, డిసెంబర్ 2 (ఈవార్తలు): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఈక్రమంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓనర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకాలు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే. అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# కిష్టయ్య బిడ్డకు కేసీఆర్ 24 లక్షల సాయం

**మంచి మనసు చాటుకున్న మాజీ సీఎం**

సిద్దిపేట, డిసెంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానం చేసుకున్న అమరవీరుడు, కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి పెద్ద దిక్కుగా నిలిచారు. కిష్టయ్య కుమార్తె పీజీ వైద్య విద్య (ఎండీ) పూర్తి చేయడానికి అవసరమైన రూ. 24 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందించారు. ఉద్యమ సమయంలో కిష్టయ్య కుటుంబానికి అండగా ఉంటానని కేసీఆర్ ఇచ్చిన హామీని ఇప్పటికీ నిలబెట్టుకుంటూ.. ఆ కుటుంబాన్ని ఇంటి పెద్దలా ఆదుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్నప్పుడు కిష్టయ్య ప్రాణత్యాగం చేశారు. అప్పుడు చిన్నపిల్లలుగా ఉన్న కిష్టయ్య ఇద్దరు పిల్లల చదువు బాధ్యతను కేసీఆర్ స్వయంగా స్వీకరించారు. కిష్టయ్య కుమార్తెను ఆరో తరగతి నుంచే చదివిస్తూ వచ్చారు. ఆమె ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేయడంలో కూడా కేసీఆర్ గతంలో ఆర్థిక సాయం అందించారు. తాజాగా.. ఆమె పీజీ (ఎండీ) ఫీజు కోసం అవసరమైన మొత్తాన్ని అందించి.. ఉన్నత విద్యలోనూ తన సహకారాన్ని కొనసాగించారు. తల్లి పద్మావతి కష్టాన్ని గుర్తు చేస్తూ.. రాష్ట్రం కోసం కిష్టయ్య త్యాగం చేసినప్పుడు చిన్నపిల్లలుగా ఉన్న వారిని తల్లి ఎంతో కష్టపడి సాదుకొని చదివించిందని కేసీఆర్ ప్రశంసించారు. “మీరు ఇప్పుడు ప్రయోజకులయ్యారు. తల్లికి ఏ కష్టం రాకుండా చూసుకోండి” అని పిల్లలు రాహుల్, ఆయన కుమార్తెకు సూచించారు. ఏ సమయంలోనైనా తన సహకారం ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. కిష్టయ్య భార్య పద్మావతి మాట్లాడుతూ.. తమకు ఊహ తెలియని సమయంలో తండ్రిని కోల్పోయినా, కేసీఆర్ తండ్రిలా అండగా నిలిచారని.. ఆయన ఇచ్చిన హామీని 15 ఏళ్లుగా నిలబెట్టుకుంటున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. కిష్టయ్య కుమారుడు రాహుల్ కూడా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న తల్లికి కేసీఆర్ అండగా ఉన్నారని ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు పూర్తి కావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ.. అమరవీరుల త్యాగ స్ఫూర్తిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.



# కంప్యూటర్ పరీక్ష పాసవ్వాల్సిందే!

**ప్రభుత్వం జీఓ నెం. 237 జారీ**

టైపిస్టులు, అసిస్టెంట్లకు సర్కారు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని పెంచే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, వేగం పెంచే లక్ష్యంతో పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరిజ్ఞాన పరీక్షను తప్పనిసరి చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ నెం. 237ను జారీ చేసింది. ఈ కొత్త నిబంధన ప్రకారం ఉద్యోగులు కంప్యూటర్ పరీక్షలో కచ్చితంగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ జీఓ ప్రకారం నిర్దేశిత కేటగిరీల ఉద్యోగులు కంప్యూటర్ పరీక్ష పాస్ కావడంతో పాటు ఆఫీస్ ఆటోమేషన్ యంత్రాల వినియోగంలో కూడా నైపుణ్యం ప్రదర్శించాలి. జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ కమ్ టైపిస్టులు, సీనియర్, జూనియర్ స్టెనోగ్రాఫర్లు, యూడీ, ఎల్డీ టైపిస్టులు వంటి క్లరికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బందికి ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వ దైనందిన కార్యకలాపాల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన వారిలో కొందరికి కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువగా ఉండవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ పరీక్ష ద్వారా ఉద్యోగులందరూ తమ సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది. ఫైళ్ల నిర్వహణ, డేటా ఎంట్రీ, కమ్యూనికేషన్ వంటి పనులు వేగవంతం కావడానికి ఇది దోహదపడుతుంది. పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. డిజిటల్ పాలనను పటిష్ఠం చేయడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# ముగిసిన రెండో విడత నామినేషన్లు

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల జోరు నడుస్తోంది. రాష్ట్రంలో మూడు విడతలుగా జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో రెండవ నామినేషన్ల ప్రక్రియ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. రెండవ విడతలో 4,333 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరగనుండగా.. వీటికి సంబంధించి 12 వేలకు పైగా నామినేషన్లు వచ్చినట్టు సమాచారం. మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు ఈనెల 11న జరగనుండగా.. రెండవ విడత ఎన్నికలు 14న నిర్వహించనుంది ఎన్నికల సంఘం. తొలి విడత ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారంలో జోరును పెంచగా.. వీరికి కేటాయించే గుర్తులు ఈనెల 4న ఎన్నికల సంఘం ప్రకటించనుంది. ఇక రేపటి నుంచి రెండవ విడత ఎన్నికల ప్రచార ప్రక్రియ కూడా మొదలు కాబోతుండగా.. పల్లెల్లో ఎన్నికల జోష్ నడుస్తోంది. ఇప్పటికే తమ అనుకూలురకు మందు, మాంసం భారీగానే పంచుతున్నట్టు తెలుస్తుండగా.. డబ్బు ఏరులై పారుతోందని అంటున్నారు. మరోవైపు బుధవారం నుంచి మూడో విడత నామినేషన్ల ప్రక్రియ కూడా

# 2,072 కోట్లు వెంటనే చెల్లించాలి

**ప్రభుత్వానికి ఈయూ డిమాండ్**



హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఆరోపించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్లకు సంబంధించి ప్రతి నెల రూ.350 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తామని హామీ ఇచ్చి, ప్రతి నెల అరకొర నిధులను విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో రెండేండ్లుగా మహాలక్ష్మీ పథకం విజయవంతంగా అమలు జరుగుతోందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. దీనికి సంబంధించి ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 8,700 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 6,620 కోట్లే విడుదల చేసి మొత్తం చెల్లించినట్లుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. కానీ ఆర్టీసీకి చెల్లించాల్సిన సొమ్ము సుమారు 2,072 కోట్లు ఇవ్వకుండా, ఆ భారాన్ని ఆర్టీసీ మీదనే ప్రభుత్వం రుద్ది చేతులు దులుపుకోవడం సమంజసం కాదని అన్నారు. అలాగే ఆర్టీసి ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 వేతన సవరణ బకాయిలు.. 2021, 2025 వేతన సవరణలు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. ఆర్టీసీకి బకాయి పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు. మహాలక్ష్మి పథకం అమలు సజావుగా అవుతున్నదని సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం.. పథకానికి అవసరమయ్యే బస్సులను సమకూర్చడంలో, సిబ్బందిని నియమించడంలో, ఈ పథకం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను నివారించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆర్టీసీలో రిటైర్ అయిన ఉద్యోగులు క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పొదుపు చేసుకున్న మొత్తాలకు చెల్లించాల్సిన వడ్డీ 15 నెలలుగా చెల్లించకపోవడం వలన కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీపై సవతి ప్రేమను విడనాడి తక్షణమే 2,072 కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.

# ఫాల్కన్ జెట్ వేలం

**792 కోట్ల స్కామ్‌లో ఈడీ కీలక చర్యలు**

**నిందితుడు అమర్‌దీప్ కుమార్ విమానానికి అర్రస్**

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): భారీ మొత్తంలో ఇన్వెస్టర్లను మోసం చేసిన ఫాల్కన్ గ్రూప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. సుమారు రూ.792 కోట్ల ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ స్కామ్‌లో ప్రధాన నిందితుడైన అమర్‌దీప్ కుమార్ కంపెనీకి చెందిన హాకర్ 800ఏ ప్రైవేట్ విమానాన్ని వేలం వేస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఈ వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని స్కామ్ బాధితులకు నష్టపరిహారంగా చెల్లించనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది. ఈడీ కథనం ప్రకారం, ఫాల్కన్ గ్రూప్ పేరుతో అమర్‌దీప్ కుమార్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పథకాన్ని ప్రారంభించి, అనేక మంది నుంచి రూ.792 కోట్లు వసూలు చేసి మోసం చేశాడు. ఈ కేసులో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం 2025 ఫిబ్రవరి 11న మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, వాటి ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. అయితే, ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడానికి ముందే అమర్‌దీప్ కుమార్ ఇదే విమానంలో దేశం విడిచి పారిపోయినట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నాడు. ఈ కేసులో భాగంగా ఈడీ 2025 మార్చి 7న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ విమానాన్ని స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ విమానం బేగంపేట ఎయిర్‌పోర్టులో ఉంది. డిసెంబర్ 9న ఎంఎస్టీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ వేలం జరగనుంది. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 7 వరకు ఈ విమానాన్ని పరిశీలించవచ్చని ఈడీ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే అమర్‌దీప్ సోదరుడు సందీప్ కుమార్, చార్టర్డ్ అకౌంటెంట్ శరద్ చంద్ర తోష్నీవాల్, కంపెనీ సీఓఓ ఆర్యన్ సింగ్ ఛాబ్రాలను ఈడీ అరెస్ట్ చేసింది. అలాగే, రూ.18.63 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. విమానం నిర్వహణ ఖర్చులు దాని విలువను మించిపోయే అవకాశం ఉన్నందున, దానిని వేలం వేయడానికి పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ నవంబర్ 20న అనుమతి ఇచ్చింది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు తెలిపారు.

# రేవంత్ హిందువులకు సారీ చెప్పు

**సీఎంపై చీకోటి ప్రవీణ్ మండిపాటు**

హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత చికోటి ప్రవీణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హిందూమతంలో కోట్లాది మంది దేవతలు ఉన్నారని, వివాహం కాని వారికి హనుమంతుడు, రెండు పెళ్లిళ్లు చేసుకునే వారికి మరో దేవుడు, మద్యపానం చేసేవారికి ఇంకొక దేవుడు ఉన్నారని, అదేవిధంగా మల్లమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ వంటి దేవతలు కూడా ఉన్నారని పేర్కొన్నారు. కల్లు పోసి, కోడిని బలిచ్చే వారికి ఒక దేవుడు, పప్పన్నం తినేవారికి సైతం ఒక దేవుడు ఉన్నారని, మనకు అన్ని రకాల దేవుళ్లు ఉన్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలపై చికోటి ప్రవీణ్ తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి హిందూ దేవతలను కించపరిచేలా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రతి ఎన్నికలోనూ హిందువుల ఓట్లు అభ్యర్థించే ఆయన, హిందూ దేవుళ్ళపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడ ఏమిటని ప్రశ్నించారు. వెంటనే రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఈ వ్యాఖ్యలకు హిందువులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



# సీఎం రేవంత్ వ్యాఖ్యలు అభ్యంతరకరం: బండి



కరీంనగర్, డిసెంబర్ 2 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవుళ్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని, ఆ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఖండించారు. కాంగ్రెస్ ముమ్మాటికీ మజ్లిస్ పార్టీకి కొమ్ముకాసే పార్టీ అని ముస్లిం అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే ముస్లిం పార్టీ అని రేవంత్ రెడ్డి చెప్పడమే ఇందుకు నిదర్శనం అన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ.. కాంగ్రెస్ నరనరాల్లో హిందూ ద్వేషం నింపుకుందని, బీఆర్ఎస్ సైతం గతంలో పలుమార్లు హిందూ దేవుళ్లను, హిందూ సంస్కృతిని కించపర్చిందన్నారు. గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్ హిందుగాళ్లు బొందుగాళ్లు అంటూ హిందువులను అవహేళన చేశారని మండిపడ్డారు. తాము ఈ విషయాన్ని ముందే పసిగట్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ కానీ బీఆర్ఎస్ గెలిస్తే హిందువులు తలెత్తుకొని బయట తిరగలేని ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించినట్లు గుర్తు చేశారు. సీఎం వ్యాఖ్యలను చూశాక ఇదే నిజమని తేలిపోయింది. హిందువుల పట్ల, హిందూ దేవుళ్ళ పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ద్వేషం బట్టబయలైంది. హిందూ సమాజం ఇకనైనా ఆలోచించుకోవాలి. ఓట్ల కోసం చీలిపోయి విడివిడిగా ఉంటూ అవహేళనను, అవమానాన్ని దిగమింగుకుంటూ ఉంటారో ఏకమై హిందువుల సత్తాను చాటుతారో తేల్చుకోవాలన్నారు. బీజేపీ ఏనాడూ ఇతర మతాలను కించపరచలేదు. కించపరిచే ఉద్దేశం కూడా లేదని, అన్ని మతాలను గౌరవించే పార్టీ అని, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో “సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్” దిశగా పని చేస్తోందన్నారు.

# కోమటిరెడ్డి ఇప్పుడే స్పృహలోకి!

**పవన్ సినిమాలు చూడొద్దంటే ఆగుతరా?**

**గీ కాంగ్రెస్ మంత్రులు చెప్తే వింటరా?.. మాజీమంత్రి జగదీశ్ రెడ్డి సెటైర్**



హైదరాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాలను చూడవద్దని కాంగ్రెస్ మంత్రులు చెబితే ప్రజలు, అభిమానులు ఆగుతారా అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. సంచలనం కోసం డైలాగులు మాట్లాడవద్దని సూచించారు. రాజోలులో పవన్ కల్యాణ్ పది రోజుల క్రితం మాట్లాడితే కాంగ్రెస్ మంత్రులు ఇప్పుడు హడావుడి చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ వారు కమీషన్లు పంచుకునే పనిలో పడి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఇన్ని రోజులు పట్టించుకోలేదా? అని ఎద్దేవా చేశారు. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పుడు స్పృహలోకి వచ్చారా అని నిలదీశారు. పవన్ వ్యాఖ్యలపై స్పందించడానికి పది రోజులు పడుతుందా అని ప్రశ్నించారు. ఇన్ని రోజులు వాటర్‌లో నీళ్లు కలుపుకున్నట్లుగా ఉందని చురక అంటించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల మీద కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు స్పందించడం వెనుక ఏమైనా ప్రత్యేక కారణాలు ఉన్నాయా లేక మ్యాచ్ ఫిక్సింగ్ ఉందా అని ప్రశ్నించారు. ఇలాంటి వారు రాష్ట్రాన్ని నడుపుతామంటే కష్టమేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలకు తెలంగాణ హక్కులు, ఆకాంక్షల పట్ల బాధ్యత లేనట్లుగా ఉందని విమర్శించారు. ఎవరు మాట్లాడినా ప్రజాస్వామిక పద్ధతిని పాటించాలని సూచించారు. పవన్ కల్యాణ్ ఇప్పటికైనా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటే మంచిదని అన్నారు.

# బీమా సొమ్ము కోసం సొంత అన్న హత్య!

రామడుగు, డిసెంబర్ 2 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలో విషాదకరమైన సంఘటన చోటు చేసుకుంది. బీమా సొమ్ము కోసం సొంత అన్ననే తమ్ముడు హత్య చేసిన ఘటన కలకలం రేపింది. రామడుగు మండల కేంద్రంలో ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే, గత నెల 29న రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి వెంకటేశ్ టిప్పర్ ఢీకొని మృతి చెందాడు. అయితే, ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా అంతా భావించారు. మట్టి తరలిస్తున్న టిప్పర్ బ్రేక్ డౌన్ కావడంతో వెంకటేశ్ టిప్పర్ ముందు భాగంలో మరమ్మతులు చేస్తుండగా, అతని తమ్ముడు నరేశ్ టిప్పర్‌ను స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు. ఈ ఘటనలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చి లోతుగా విచారణ జరిపారు. వెంకటేశ్ హత్యకు సంబంధించిన కుట్ర ప్రణాళికను నిందితులు ఫోన్‌లో వీడియో తీశారు. ఆ వీడియో లభ్యమవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మృతుడు వెంకటేశ్ పేరు మీద రెండు నెలల్లోనే 10 కంపెనీలలో రూ.4.14 కోట్ల విలువైన బీమా పాలసీలను నరేశ్ తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. బీమా సొమ్ము కోసమే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

# శబరిమలకు మరో 10 స్పెషల్ రైళ్లు



సికింద్రాబాద్, డిసెంబర్ 2 (ఈవార్తలు): శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తులకు రైల్వే శాఖ గుడ్ న్యూస్ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే 60 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు.. తాజాగా మరో 10 ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయించారు. డిసెంబర్ 13 నుంచి 31 మధ్య ఈ ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉండటంతోపాటు.. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు నడవనున్నాయి. అలాగే రేపటి నుంచే ఈ సర్వీసులకు బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. అయితే వీటిలో సిర్పూర్ కాగజ్ నగర్ – కొల్లం జంక్షన్ (రైలు నం. 07117), చర్లపల్లి – కొల్లం జంక్షన్ (07119), చర్లపల్లి – కొల్లం జంక్షన్ (07121), హుజుర్ సాహిబ్ నాందేడ్ – కొల్లం (07123) రైళ్లకు మొదటగా టికెట్లు అందుబాటులోకి వస్తాయని అధికారులు పేర్కొన్నారు.




## నవయుగ యత్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మల్యాల, డిసెంబర్ 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఒబులాపూర్ నవయుగ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరబత్తిని గంగాధర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శ్రీగాదె విష్ణు, ప్రధాన కార్యదర్శిగా దాసరి గంగరాజం, కోశాధికారిగా బండి రవీందర్‌ను ఎన్నుకొన్నారు. వీరి నియామకంతో కొత్త కార్యవర్గం కొలువుదీరింది.



## వేములవాడ ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌వో తనిఖీ

వేములవాడ, డిసెంబర్ 2 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత వేములవాడలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనలు ఆసుపత్రులలో ఏ మేరకు అమలు అవుతున్నాయో తెలుసుకొనేందుకు ఆమె.. ప్రైవేట్ ఆసుపత్రుల పనితీరును డీఎంహెచ్ఓ సమీక్షించారు. ముఖ్యంగా, డాక్టర్ల పేర్లు, ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది వివరాలు, రోగులకు అందించే వైద్య సేవల ధరల వివరాల నమోదు వంటివి నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించారు.

# ఆర్మీలో ఆండ్రాయిడ్ బ్యాన్

### ఐఫోన్లు మాత్రమే వాడాలి.. ఇజ్రాయెల్ సర్కారు ఆదేశాలు

జెరూసలేం: సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేందుకు ఇజ్రాయెల్ రక్షణ దళాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. లెఫ్టినెంట్ కల్నల్ అంతకంటే ఎక్కువ స్థాయి సీనియర్ అధికారులు ఇకపై అధికారిక కమ్యూనికేషన్స్ కోసం కేవలం ఐఫోన్స్‌ను మాత్రమే ఉపయోగించాలని ఆదేశించారు. భద్రతా కారణాల నేపథ్యంలో ఆండ్రాయిడ్ ఫోన్స్‌ను పూర్తిగా నిషేధించారు. అనేక ఉల్లంఘనలు, సైన్యంలో సైబర్ గూఢచౌర్యం కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఆండ్రాయిడ్ డివైజెస్‌లో సైబర్ దాడులు పెరుగుతున్నట్లుగా ఇజ్రాయెల్ ఆర్మీ రేడియో, జెరూసలేం పోస్ట్ తెలిపాయి. ఇటీవలి సంవత్సరాల్లో సైనికులు, అధికారులను లక్ష్యంగా చేసుకుని అనేక హనీపాట్ దాడులు గుర్తించారు. సున్నితమైన డేటాను దొంగిలించడానికి ఫోన్లలో మాల్వేర్‌ను ఇంజెక్ట్ చేయడానికి నకిలీ ప్రొఫైల్‌లను ఉపయోగించారు. కొత్త మార్గదర్శకాలు ఐఫోన్‌లను మాత్రమే సైనిక ప్రయోజనాల కోసం ఉపయోగించనున్నారు. ఆపరేషనల్, కమాండ్ సంబంధిత కార్యకలాపాల కోసం ఆండ్రాయిడ్ ఫోన్స్‌ను అనుమతించరు. ఇకపై ఆండ్రాయిడ్ పరికరాలు వ్యక్తిగత ఉపయోగానికి మాత్రమే అనుమతి ఉంటుంది. గూగుల్ ఇటీవల తన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ భద్రతా జాబితాలో చేర్చిందని పేర్కొన్న తర్వాతే.. ఈ నిర్ణయం వెలుగులోకి వచ్చింది. పిక్సెల్ అత్యాధునిక భద్రతా వ్యవస్థను కలిగి ఉందని గూగుల్ తెలిపింది. కానీ, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్.. ఐఫోన్ మూసివేసినా, నియంత్రిత పర్యావరణ వ్యవస్థ సురక్షితమని గుర్తించింది. నివేదికల ప్రకారం.. ఐడీఎఫ్ సంవత్సరాలుగా పలు సంవత్సరాలుగా అంతర్గత సెక్యూరిటీపై పలు ట్రయల్స్ నిర్వహించింది. ఈ ట్రయల్స్‌లో ఆండ్రాయిడ్ డివైజెస్‌లో లోపాలు ఉన్నట్లుగా తేలింది.

# పవన్ సినిమాలను మ్యాట్నీ నుంచే చూడరు

### ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని సెటైర్లు.. కోమటిరెడ్డి పిచ్చి మంత్రి అని ఎద్దేవా



తాడేపల్లి, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో మొదలైన రాజకీయ దుమారం మరింత ముదురుతోంది. తెలంగాణ, ఏపీ నేతల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరగా, ఈ వివాదంపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఘాటుగా స్పందించారు. పవన్ కల్యాణ్ సినిమాలను ఆడనివ్వబోమని హెచ్చరించిన తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని 'ఒక పిచ్చి సినిమాటోగ్రఫీ మంత్రి' అంటూ అభివర్ణించారు. పవన్ సినిమాలను ఎవరూ ఆపాల్సిన అవసరం లేదని, అవే ఆగిపోతాయని ఎద్దేవా చేశారు. ఇటీవల రాజోలు పర్యటనలో పవన్ కల్యాణ్.. కోనసీమకు తెలంగాణ నేతల దిష్టి తగిలిందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తెలంగాణ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందిస్తూ, పవన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని, లేకపోతే తెలంగాణలో ఆయన సినిమాలు ఎలా విడుదలవుతాయో చూస్తామని హెచ్చరించారు. కోమటిరెడ్డి హెచ్చరికలపై పేర్ని నాని తనదైన శైలిలో స్పందించారు. "పవన్ కల్యాణ్ సినిమాను సినిమాటోగ్రఫీ మంత్రి వచ్చి ఆపాలా? ఆయన సినిమా మార్నింగ్ షో పడితే మ్యాట్నీకి ఆడటమే కష్టం. మధ్యాహ్నానికే దాన్ని ఎత్తేస్తారు. అలాంటిది మంత్రి వచ్చి ఆపాల్సిన అవసరం ఏముంది?... జనాలే చూడడడం మానేస్తారు అని పేర్ని నాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అతడి సినిమా కొనుక్కున్న డిస్ట్రిబ్యూటర్లు బికారులుగా మారిపోయారు అంటూ వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో పవన్ నటించిన సినిమా నిర్మాతపై కూడా నాని సంచలన ఆరోపణలు చేశారు. "ఆ సినిమా నిర్మాత ఇప్పటివరకు ప్రభుత్వానికి జీఎస్టీ కూడా కట్టలేదు. అయినా ప్రభుత్వంలో ఉన్న ఒక్క అధికారి కూడా ఇదేంటని ప్రశ్నించలేదు" అని ఆయన విమర్శించారు. మొత్తం మీద, పవన్ చేసిన ఒక్క వ్యాఖ్య ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయ నాయకుల మధ్య తీవ్ర మాటల యుద్ధానికి దారితీసింది.



## నెల్లూరు మేయర్ పై అవిశ్వాసం... 18న ఓటింగ్!

నెల్లూరు, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఏపీలోని నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతిపై అవిశ్వాస తీర్మానానికి ముహూర్తం ఖరారైంది. డిసెంబర్ 18న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్‌లోని మెజారిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీకి మద్దతు పలకడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. నెల్లూరు కార్పొరేషన్‌లో మొత్తం 54 డివిజన్లు ఉన్నాయి. అయితే, ఇటీవల రాజకీయ సమీకరణాలు మారడంతో వీరిలో 40 మందికి పైగా కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీకి 42 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. ఈ సంఖ్యా బలంతో, కొత్త మేయర్‌ను ఎన్నుకోవాలనే ఉద్దేశంతో కార్పొరేటర్లు ఇటీవల కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేశారు. ఈ నోటీసులను పరిశీలించిన కలెక్టర్, అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు తేదీని ఖరారు చేశారు. డిసెంబర్ 18న జరిగే ప్రత్యేక సమావేశంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఓటింగ్‌తో ప్రస్తుత మేయర్ స్రవంతి భవితవ్యం తేలిపోనుంది. అనంతరం కొత్త మేయర్ ఎన్నికకు మార్గం సుగమం కానుంది.

## కమల్ సురేశ్‌కు కీలక పదవి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో నవంబర్ 28 నుండి 30 వరకు జరిగిన 71వ జాతీయ మహాసభల్లో హైదరాబాద్‌కు చెందిన జర్నలిజం రీసెర్చ్ స్కాలర్ కమల్ సురేష్‌ను ఏబీవీపీ ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్‌గా జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ రఘురాజ్ కిషోర్ తివారీ నియమించారు. ఈ సందర్భంగా కమల్ సురేష్ మాట్లాడుతూ తనకు ఈ కీలక బాధ్యతలు అప్పగించిన ఏబీవీపీ తెలంగాణ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల పర్యటనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, టీచింగ్-నాన్ టీచింగ్ ఖాళీల భర్తీ, రీసెర్చ్ అవకాశాల విస్తరణ కోసం కృషి చేస్తానని అన్నారు. విద్యార్థుల్లో జాతీయ చైతన్యం పెంపొందించడం, విశ్వవిద్యాలయ సమస్యలపై నిరంతర ఉద్యమం ఏబీవీపీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో కమల్ సురేష్ ఒస్మానియా విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల అధ్యక్షుడు, సైఫాబాద్ జోనల్ ఇన్‌చార్జ్, చార్మినార్ జిల్లా కన్వీనర్, భాగ్యనగర్ విభాగ్ కన్వీనర్‌గా, అలాగే రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నో బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే.

## నామినేషన్ విత్‌డ్రా కోసం దాడి

**నిందితులపై కేసు నమోదు**

తంగళ్లపల్లి, డిసెంబర్ 2 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుంకపాక శరత్‌పై దాడికి పాల్పడిన నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శరత్ తన గ్రామంలో 1వ వార్డుకు నామినేషన్ వేశారు. అయితే, ఆ నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దేవచంద్రం, సాయి, కంకర రాజు, కంకర కిషన్ చంపుతామని బెదిరించారు. దీంతో బాధితుడి బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వైసీపీలో గౌరవం లేదు

### మండలి ఛైర్మన్ ఎదుట ఎమ్మెల్సీలు



అమరావతి, డిసెంబర్ 2 (ఈవార్తలు): వైసీపీకి రాజీనామా చేసిన ఆరుగురు ఎమ్మెల్సీలు శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజుతో భేటీ అయ్యారు. తమ రాజీనామాలను వెంటనే ఆమోదించాలని వారు ఛైర్మన్‌ను కోరారు. ఎమ్మెల్సీలు జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, పద్మశ్రీ, బల్లి దుర్గాప్రసాద్, జకీయా ఖానుమ్, పోతుల సునీత మండలి కార్యాలయానికి వచ్చి ఛైర్మన్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా, ప్రలోభాలకు లోనై రాజీనామాలు చేశారా? అని ఛైర్మన్ మోషేన్ రాజు ఎమ్మెల్సీలను ప్రశ్నించారు. ముఖ్యంగా, జనసేనలో చేరితే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారా? అని జయమంగళను అడిగారు. దీనికి జయమంగళ స్పందిస్తూ.. తాను స్వచ్ఛందంగానే వైసీపీని వీడి జనసేనలో చేరానని, తన వ్యాపార, రాజకీయ అవసరాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తన రాజీనామాపై నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మరో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ, వైసీపీలో తమకు విలువ, గౌరవం లేకపోవడం వల్లే రాజీనామా చేశామన్నారు. టీడీపీలో వైసీపీ కన్నా ఎక్కువ ప్రజాస్వామ్యం ఉందని అభిప్రాయపడ్డారు. తాను కమ్మ సామాజిక వర్గానికి చెందిన వాడిననే టీడీపీలో చేరుతున్నాననడం సరికాదని స్పష్టం చేశారు. పదవీకాలం తక్కువగా ఉన్నందున పునరాలోచించుకోవాలని ఛైర్మన్ వారికి సూచించారు. అయితే, ఎమ్మెల్సీలు తాము స్వచ్ఛందంగానే రాజీనామాలు చేశామని, వైసీపీలో కొనసాగే ఉద్దేశం లేదని తేల్చి చెప్పారు. దీంతో ఆరుగురు ఎమ్మెల్సీల రాజీనామాలపై ఛైర్మన్ మోషేన్ రాజు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## హైకోర్టుకు 'పరకామణి' నివేదిక

**కేసుపై శుక్రవారం తదుపరి విచారణ**




అమరావతి, డిసెంబర్ 2 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి ఆలయం పరకామణిలో జరిగిన చోరీ కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసుపై విచారణ జరిపిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తన నివేదికను సమర్పించింది. సిట్ బృందానికి నేతృత్వం వహించిన సీఐడీ అదనపు డీజీ రవిశంకర్ అయ్యనార్, ఈ నివేదికను సీల్డ్ కవర్‌లో న్యాయస్థానానికి అందజేశారు. ఈ కేసుపై తదుపరి విచారణను హైకోర్టు శుక్రవారం చేపట్టనుంది. 2023 ఏప్రిల్‌లో తిరుమల పరకామణిలో టీటీడీ ఉద్యోగి రవికుమార్ 920 డాలర్లు దొంగిలిస్తూ పట్టుబడ్డాడు. ఈ ఘటనపై తిరుమల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అయితే, అనూహ్యంగా ఈ కేసును లోక్ అదాలత్‌కు బదిలీ చేశారు. నిందితుడు రవికుమార్ తనకు చెందిన రూ.40 కోట్ల విలువైన ఏడు ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇవ్వడంతో, 2023 సెప్టెంబర్‌లో కేసును రాజీ ఫార్ములాతో మూసివేశారు. అయితే, చిన్న దొంగతనం కేసుకు ఇంత పెద్ద మొత్తంలో ఆస్తులు విరాళంగా ఇచ్చి కేసును మూసివేయించడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై మాచర్ల శ్రీనివాస్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించడాన్ని సవాలు చేస్తూ, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, కేసుపై దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో సిట్ విచారణ ప్రారంభించింది. ఈ విచారణలో భాగంగా సిట్ అధికారులు.. కేసు నమోదైనప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న బి. కరుణాకర్ రెడ్డి, లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగినప్పుడు టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డిని, మాజీ ఈవో ధర్మారెడ్డితో పాటు పలువురు టీటీడీ, పోలీసు అధికారులను ప్రశ్నించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఇప్పుడు సిట్ సమర్పించిన నివేదిక ఆధారంగా హైకోర్టు తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.




## కోహ్లీ ఆడుతాడు!

### విజయ్ హజారే ట్రోఫీలో ఆడడంపై క్లారిటీ

### ధ్రువీకరించిన డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ

ఢిల్లీ: టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చాలా కాలం తర్వాత దేశవాళీ క్రికెట్‌లో అడుగుపెట్టనున్నాడు. త్వరలో ప్రారంభం కానున్న విజయ్ హజారే ట్రోఫీలో అతను ఢిల్లీ జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ) అధ్యక్షుడు రోహన్ జైట్లీ ధ్రువీకరించారు. "విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు విరాట్ కోహ్లీ తన అంగీకారాన్ని మాకు తెలియజేశాడు" అని రోహన్ జైట్లీ ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ స్పష్టం చేశారు. ఈ టోర్నమెంట్ డిసెంబర్ 24 నుంచి జనవరి 18 వరకు జరగనుంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో కోహ్లీ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని రాక, దేశవాళీ టోర్నీలలో పేలవ ప్రదర్శనతో సతమతమవుతున్న ఢిల్లీ జట్టుకు పెద్ద ఊరటనివ్వనుంది. విరాట్ కోహ్లీ దశాబ్దానికి పైగా విరామం తర్వాత విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతుండటం విశేషం. చివరిసారిగా 2008-2010 మధ్య కాలంలో అతను ఈ టోర్నీలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించాడు. ఆ సమయంలో 13 మ్యాచ్‌లలో 68.25 సగటుతో 4 సెంచరీలు, 3 అర్ధసెంచరీలతో కలిపి 819 పరుగులు సాధించాడు. జమ్మూ కశ్మీర్, త్రిపుర వంటి జట్ల చేతిలో కూడా ఓటమి పాలైన ఢిల్లీకి కోహ్లీ అనుభవం, నాయకత్వ పటిమ ఎంతో మేలు చేయనుంది. ప్రస్తుతం కోహ్లీ టెస్టు, టీ20 ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించి, కేవలం వన్డేల్లోనే జాతీయ జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అతని చేరిక ఢిల్లీ యువ ఆటగాళ్లలో స్ఫూర్తి నింపనుంది.

## వలసదారులకు రెడ్ కార్పెట్ పరవాలా?

**రోహింగ్యాల మిస్సింగ్ కేసుపై సీజేఐ కామెంట్స్**



న్యూఢిల్లీ: ఐదుగురు రోహింగ్యాలు కనిపించడం లేదంటూ నమోదైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్రమ వలసదారులకు దేశంలో రెడ్ కార్పెట్ పరచాలా? అని ఆయన ప్రశ్నించారు. దేశంలో అక్రమంగా ప్రవేశించిన వారిని ఇక్కడే ఉంచాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందా? అని నిలదీశారు. ఐదుగురు రోహింగ్యాలకు కస్టడీ నుంచి మాయమయ్యారని, దేశబహిష్కార ప్రక్రియ నిబంధనలు పాటించాలంటూ నమోదైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'బోర్డర్ దగ్గర సొరంగం తవ్వి లేదా ఫెన్స్ దాటి దేశంలో అక్రమంగా ప్రవేశిస్తారు. నేను ఇప్పుడు ఇక్కడకు వచ్చాను కాబట్టి.. ఈ దేశంలోని చట్టాలు అమలవ్వాలి అంటారు. ఆహారం, షెల్టర్, నా పిల్లలకు విద్య దక్కాలని వాదిస్తారు. చట్టాలను అంత విస్తృతం చేయాలా?' అని సీజేఐ ప్రశ్నించారు. 'మన దేశంలో కూడా బీదవారున్నారు. వాళు మన పౌరులు. వాళ్లకు కొన్ని వసతులు, సదుపాయాలు పొందే హక్కు లేదా? వాళ్లపై ఎందుకు ఫోకస్ పెట్టడం లేదు?' అని జస్టిస్ సూర్యకాంత్ అడిగారు. ఇలా అక్రమ వలసదారుల విషయంలో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం చాలా ఫ్యాన్సీగా ఉంటుందని విమర్శించారు. హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తే అరెస్టయిన వ్యక్తి ఎవరైనా అతన్ని కస్టడీలో ఉంచడం చట్టబద్ధమైనదేనా? కాదా? అని నిర్ణయించేందుకు కోర్టు ముందు హాజరుపరచాలి. అయితే ఇలా దేశంలో అక్రమంగా ప్రవేశించిన వారిని కూడా థర్డ్ డిగ్రీ పద్ధతుల్లో విచారించకూడదని సీజేఐ స్పష్టంచేశారు. ఇదే సమయంలో రోహింగ్యాలను శరణార్థులుగా గుర్తించలేదని ఆయన చెప్పారు. 'చట్టబద్ధంగా శరణార్థుల స్టేటస్ లేకుండా.. దేశంలో అక్రమంగా ప్రవేశించిన వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందా? ఉత్తర భారతంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు పరిస్థితులున్నాయి. ఇలాంటి సమయంలో చొరబాటుదార్లు ప్రవేశిస్తే.. వారికి రెడ్ కార్పెట్ పరుస్తామా?' అని సీజేఐ నిలదీశారు. బాధితులు నేరుగా కోర్టును సంప్రదించినప్పుడే ఇలాంటి కేసులపై విచారణ చేపట్టాలని, లేదంటే అసలు వీటిని ఏమాత్రం ఉపేక్షించకూడదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ఈ క్రమంలో కేసు విచారణను డిసెంబరు 16న ఇలాంటి మిగతా కేసులతో కలిపి చేపడతామని సుప్రీంకోర్టు పేర్కొంది.



## జగన్ పాలనలో విమాన ఖర్చులు 222 కోట్లు

అమరావతి, డిసెంబర్ 2 (ఈవార్తలు): ఏపీ మాజీ సీఎం , వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో విమాన ప్రయాణాల కోసం పెట్టిన ఖర్చు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2019 నుంచి 2024 మధ్య కాలంలో ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏసీఎల్) ద్వారా ఏకంగా రూ.222.85 కోట్లు వెచ్చించినట్లు తాజాగా వెల్లడైన రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలోనూ ఈ వ్యయం తగ్గకపోవడం గమనార్హం. మొత్తం ఐదేళ్ల ఖర్చును పరిశీలిస్తే... విమానాల చార్జీలకు రూ.112.50 కోట్లు, హెలికాప్టర్ చార్జీలకు రూ.87.02 కోట్లు, ఇతర నిర్వహణ ఖర్చుల కింద రూ.23.31 కోట్లు చెల్లించారు. హెలికాప్టర్ చార్జీల మొత్తాన్ని జీఎంఆర్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెల్లించినట్లు రికార్డుల్లో ఉంది. ఈ గణాంకాలు బయటకు రావడంతో అధికార తెలుగుదేశం పార్టీ, గత ప్రభుత్వ తీరును ఎండగడుతోంది. మంత్రి నారా లోకేశ్ పర్యటన ఖర్చులతో పోలుస్తూ టీడీపీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "18 నెలలు మంత్రిగా ఉన్నప్పుడు లోకేశ్ తన హెలికాప్టర్/ప్రత్యేక విమాన ప్రయాణాలకు ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. కానీ, 60 నెలలు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రూ.222 కోట్లు ఖర్చు చేశారు" అని టీడీపీ ఆరోపించింది.

# సరదగా అలా.. అలా..!

## సిద్ధరామయ్యతో భేటీపై డీకే.. విభేదాలు మీడియా సృష్టేనని వెల్లడి

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీలో ఐక్యత అసెంబ్లీ సమావేశాల వరకు పరిమితం కాదని, అది ఎల్లప్పుడూ ఉంటుందని కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ స్పష్టం చేశారు. తమ ఎమ్మెల్యేలలో ఎలాంటి విభేదాలు లేవని, మీడియానే విభేదాలు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు. "అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు మాత్రమే మీ పార్టీలో ఐక్యత ఉంటుందా" అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, డీకే శివకుమార్ ఈ విధంగా సమాధానమిచ్చారు. బ్రేక్‌ఫాస్ట్ అనంతరం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలందరూ ఐక్యంగానే ఉన్నారని, ప్రతిపక్షాలను ఐక్యంగా ఎదుర్కొంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా స్పష్టం చేశారు. తమ మధ్య ఐక్యత ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. తాను, శివకుమార్ కలిసి ముందుకు సాగుతున్నామని, కలిసే ప్రభుత్వాన్ని నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. సిద్ధరామయ్యతో కలిసి సరదాగా బ్రేక్‌ఫాస్ట్ చేశానని, అదే సమయంలో ఢిల్లీకి వెళ్లే అంశంపై తమ మధ్య చర్చ జరిగిందని డీకేశివకుమార్ వెల్లడించారు. పార్టీ అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించినట్లు చెప్పారు. డిసెంబర్ 8న ఢిల్లీకి వెళ్లి అదే రోజు తిరిగి రావాలని దాదాపు నిర్ణయించుకున్నామని అన్నారు.



పార్టీ ఎంపీలకు బాధ్యతలు కూడా అప్పగించవలసి ఉందని అన్నారు. కావేరీ జలాలపై తీర్పు, రాష్ట్రానికి నిధులు సహా వివిధ పెండింగ్ పనులకు సంబంధించి ఎంపీలకు బాధ్యతలు అప్పగిస్తామని వెల్లడించారు. కొన్ని అంశాలపై ప్రతిపక్ష నాయకులను కూడా ఢిల్లీకి తీసుకు వెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. ఢిల్లీకి వెళ్లిన సమయంలో రాహుల్ గాంధీ, సోనియా గాంధీలను కలుస్తారా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, వారు మొదట తమని ఆహ్వానించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్యను మొదట తాను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించానని, ప్రతిగా ఆయన కూడా తనను ఆహ్వానించడంతో ఆయన ఇంటికి వెళ్లానని చెప్పారు. ఇప్పుడు తన ఇంటికి బ్రేక్‌ఫాస్ట్ కోసం వచ్చాడని వెల్లడించారు. సిద్ధరామయ్య కోసం మైసూరు తరహా వంటకాలు సిద్ధం చేశామని అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మధ్యలో జోక్యం చేసుకుని, శివకుమార్ భార్య మైసూరుకు చెందినవారేనని గుర్తు చేశారు. బ్రేక్‌ఫాస్ట్ సమయంలో రాజకీయాలు కూడా చర్చించామని, నాలుగు ఎమ్మెల్సీలకు సంబంధించి ప్రకటన చేయాల్సి ఉందని అన్నారు. ఈ అంశానికి సంబంధించి పార్టీ కర్ణాటక రాష్ట్ర ఇన్‌ఛార్జ్ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలాతో మాట్లాడామని, ఒక సీటు విషయంలో కొంత భిన్నాభిప్రాయాలు ఉన్నాయని చెప్పారు. అధిష్ఠానానికి జాబితాను పంపించినట్లు చెప్పారు. అసెంబ్లీ సమావేశంలో ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే వ్యూహాలపై కూడా చర్చించామని అన్నారు. ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి అంశానికి సమాధానం చెబుతామని అన్నారు.

### అన్నదమ్ముల్లాంటి వాళ్లం: సిద్ధరామయ్య

తాను, శివకుమార్ అన్నదమ్ముల్లాంటి వాళ్లం.. పార్టీ కోసం ఎప్పుడూ కలిసే పనిచేస్తామని సిద్ధరామయ్య అన్నారు. శివకుమార్ ఎప్పుడు సీఎం అవుతారని కొందరు అడుగుతున్నారు.. అధిష్ఠానం ఎప్పుడు నిర్ణయిస్తే అప్పుడే అవుతారు అని బదులిచ్చారు. ఈ నెల 8 నుంచి జరిగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. బీజేపీ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతోందని, ఆ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటామని వివరించారు. కాగా, ఈ అల్పాహార విందు భేటీలో ఆహారం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిద్ధరామయ్య కోసం ప్రత్యేకంగా ఇడ్లీ, ఆయన ఇష్టపడే 'నాటు కోడి పులుసు' సిద్ధం చేశారు. తాను మాంసాహారినని, శివకుమార్ శాకాహారి అని సిద్ధరామయ్య సరదాగా వ్యాఖ్యానించారు.

## జిలేబీలు వండిన న్యూజిలాండ్ ప్రధాని

ఆక్లాండ్: న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లుక్సాన్ ఆక్లాండ్‌లో జరిగిన సిక్కు కమ్యూనిటీ క్రీడల్లో సంప్రదాయ భారతీయ జిలేబీలను తయారు చేశారు. ఆయన జిలేబీలు వేస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఎంతోమంది హృదయాలను గెలుచుకుంది. క్రిస్టోఫర్ స్థానిక ఎంపీ రిమా నఖ్లేతో కలిసి టకానినిలో జరిగిన క్రీడా కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయన అథ్లెట్లను కలిసి, క్రీడాకారులు, సహాయకులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ జిలేబీలు తయారు చేస్తున్న వారి వద్దకు వెళ్లి సరదాగా జిలేబీలు వేశారు. ఆయన నవ్వుతూ కడాయిలో జిలేబీలు వేస్తుంటే అక్కడున్న వారు ఆసక్తిగా తిలకించారు. ఆ తర్వాత అక్కడున్న వారికి స్వయంగా జిలేబీలను అందించారు. ఇందుకు సంబంధించిన వీడియోను క్రిస్టోఫర్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ రీమా నఖ్లేతో కలిసి సిక్కు క్రీడా ప్రారంభోత్సవంలో పాల్గొన్నానని ఆయన పేర్కొన్నారు.

# రేపు భారత్‌కు పుతిన్

**రష్యా నుంచే ఆహారం, నీళ్లు, టాయిలెట్ తొట్టి**

న్యూఢిల్లీ/మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆయన భద్రత కోసం ఏర్పాటు చేస్తున్న ఏర్పాట్లు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఆయన తాగే నీరు, తినే ఆహారం మాత్రమే కాదు.. ఉపయోగించే టాయిలెట్‌ను కూడా రష్యా నుంచే ప్రత్యేకంగా తీసుకురానుండటం ఆయన భద్రతా ప్రమాణాల తీవ్రతను తెలియజేస్తోంది. విదేశీ పర్యటనల్లో పుతిన్ భద్రతను ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ పర్యవేక్షిస్తుంది. అధ్యక్షుడి రాకకు నెల రోజుల ముందే ఒక బృందం ఆతిథ్య దేశానికి చేరుకొని, ఆయన బస చేసే హోటల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తుంది. ఆయన వాడే సబ్బులు, షాంపూల నుంచి టూత్‌పేస్ట్ వరకు అన్నీ రష్యా నుంచే తెచ్చి హోటల్ గదిలో అమర్చుతారు. భద్రతా కారణాల దృష్ట్యా పుతిన్ మొబైల్ ఫోన్ ఉపయోగించరు. అత్యంత సురక్షితమైన కమ్యూనికేషన్ లైన్ ద్వారానే సంభాషణలు జరుపుతారు. ఇందుకోసం ఆయన గదిలోనే ప్రత్యేక టెలిఫోన్ బూత్‌ను ఏర్పాటు చేస్తారు. పుతిన్ ప్రయాణించే ఇల్యూషిన్ ఐఎల్-96-300పీయూ విమానాన్ని 'ఎగిరే క్రెమ్లిన్' అని పిలుస్తారు. ఇందులో సమావేశ గదులు, జిమ్, మెడికల్ రూమ్‌తో పాటు అణుదాడికి ఆదేశాలు జారీ చేసే 'న్యూక్లియర్ కమాండ్ బటన్' కూడా ఉంటుంది. ఆయన విమానానికి యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా ఉంటాయి. సాంకేతిక సమస్యలు ఎదురైతే, ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని కూడా వెంట తీసుకువస్తారు. పర్యటనలో పుతిన్ ప్రయాణించే 'ఆరస్ సెనెట్' కారును కూడా రష్యా నుంచే తీసుకొస్తారు. ఈ కారు బుల్లెట్లు, గ్రెనేడ్లు, రసాయన దాడులను సైతం తట్టుకోగలదు. నాలుగు టైర్లు పంక్చర్ అయినా ఆగకుండా ప్రయాణించగలదు. ఇక ఆహారం విషయానికొస్తే, రష్యా నుంచి తెచ్చిన పదార్థాలను ప్రత్యేక చెఫ్‌లు వండుతారు. వండిన ఆహారాన్ని పుతిన్ తినే ముందు పరీక్షించడానికి ఒక మొబైల్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. బహిరంగ కార్యక్రమాల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించే పుతిన్ చుట్టూ ఎల్లప్పుడూ నాలుగంచెల భద్రతా వలయం ఉంటుంది.






## భారత్‌లో అమ్మకాల్లో తుస్

# పాపం.. టెస్లా!

### ఇప్పటిదాకా 157 కార్లే విక్రయం

ముంబై: ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత మార్కెట్లో తన ప్రయాణాన్ని నెమ్మదిగా ప్రారంభించింది. సెప్టెంబర్‌లో డెలివరీలు మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 157 కార్లను మాత్రమే విక్రయించింది. ప్రభుత్వ వాహన్ పోర్టల్ గణాంకాల ప్రకారం నవంబర్ నెలలో కేవలం 48 కార్లను మాత్రమే విక్రయించి, పోటీదారుల కంటే వెనుకబడింది. భారత లగ్జరీ కార్ల మార్కెట్లో ఇప్పటికే పట్టు సాధించిన బీఎండబ్ల్యూ, నవంబర్‌లో ఏకంగా 267 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. ఈ గణాంకాలు టెస్లా ఎదుర్కొంటున్న తీవ్రమైన పోటీని స్పష్టం చేస్తున్నాయి. అమెరికాకు చెందిన ఈ సంస్థ, 'మోడల్ వై' ఎలక్ట్రిక్ ఎస్‌యూవీతో భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఆరంభంలో భారీ అంచనాలు ఉన్నప్పటికీ, అమ్మకాల సంఖ్య ఆశించిన స్థాయిలో లేదు. అయితే, అమ్మకాలు నెమ్మదిగా ఉన్నప్పటికీ టెస్లా తన విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేస్తోంది. గతవారం గురుగ్రామ్‌లోని ఆర్కిడ్ బిజినెస్ పార్క్‌లో మొట్టమొదటి 'ఆల్-ఇన్-వన్ టెస్లా సెంటర్'ను ప్రారంభించింది. ఇక్కడే రిటైల్, సర్వీస్, డెలివరీ, ఛార్జింగ్ సదుపాయాలను ఒకేచోట అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ మాట్లాడుతూ, ఉత్తర భారతంలో టెస్లా కమ్యూనిటీకి మద్దతుగా ఈ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా వినియోగదారుల్లో నమ్మకాన్ని పెంచి, ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కొత్త సెంటర్‌లో మోడల్ వై టెస్ట్ డ్రైవ్ చేయడంతో పాటు అత్యాధునిక %ఎ%4 సూపర్ ఛార్జర్లను, కంపెనీకి చెందిన హ్యూమనాయిడ్ రోబోట్ 'ఆప్టిమస్ జెన్ 2'ను కూడా ప్రదర్శనకు ఉంచారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి, ఈ వారం జరగనున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక పాలసీ సమావేశంపై నెలకొన్న ఆందోళనలు సూచీల పతనానికి దారితీశాయి. ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం, ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 503.63 పాయింట్లు నష్టపోయి 85,138.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 143.55 పాయింట్లు తగ్గి 26,032.20 వద్ద ముగిసింది. ఉదయం సెషన్ 85,325.51 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా అమ్మకాల ఒత్తిడికి గురైంది. బ్యాంకింగ్, ఐటీ వంటి ప్రధాన రంగాల షేర్లలో అమ్మకాలతో ఇంట్రాడేలో 85,053.0 కనిష్ఠ స్థాయిని తాకింది. బలహీనపడుతున్న రూపాయి, కొనసాగుతున్న ఎఫ్ఐఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు తెలిపారు. మరోవైపు, బలమైన జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గడం కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసింది. దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ బ్యాంక్ 0.68 శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.10 శాతం మేర పతనమయ్యాయి. దీనికి విరుద్ధంగా, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.5 శాతం లాభపడింది. సెన్సెక్స్ బాస్కెట్‌లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్%డ%టీ, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్‌లో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి.

## ఇమ్రాన్ ఆరోగ్యంగానే.. కానీ!

**మానసికంగా వేధిస్తున్నారు: సోదరి**



ఇస్లామాబాద్: జైలులో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నారని, అయితే మానసికంగా ఆయన తీవ్ర వేదన అనుభవిస్తున్నారని ఆయన సోదరి ఉజ్మా ఖాన్ వెల్లడించారు. రావల్పిండిలోని అడియాలా జైలులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఆమె కలిశారు. సోదరుడ్ని పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. ఇమ్రాన్ ఖాన్ మానసికంగా చాలా ధృఢంగా ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విరుద్ధ పాలనకు వ్యతిరేకంగా ప్రజలకు, అలాగే పీటీఐ పార్టీకి ఆయన సందేశాన్నిచ్చారని తెలిపారు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ జైలులో తనను మానసికంగా వేధిస్తున్నారని ఇమ్రాన్ ఖాన్ చెప్పినట్లు ఉజ్మా పేర్కొన్నారని స్థానిక మీడియా వెల్లడించింది. జైలులో తనకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారని ఆమె తెలిపారు. అయినప్పటికీ ఆయన మానసిక స్థైర్యం చెక్కుచెదరకుండా ఉందని అన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను చూసేందుకు ఆయన సోదరి ఉజ్మా ఖానుమ్‌కు ఇవాళ అనుమతి లభించడం తెలిసిందే. అంతకుముందు ఆయనను కలిసేందుకు పార్టీ నేతలకు, కుటుంబ సభ్యులకు అనుమతి లభించకపోవడంతో పీటీఐ నిరసనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, మంగళవారం నాడు ఆయన సోదరిని జైలులోకి అనుమతించారు.

## ఇండిగోకు 117 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు జీఎస్టీ విభాగం నుంచి భారీ షాక్ తగిలింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలకు సంబంధించి కొచ్చి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ రూ. 117.52 కోట్ల జరిమానా విధించింది. ఈ మేరకు మంగళవారం కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. 2018-19, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కంపెనీ క్లెయిమ్ చేసిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ అధికారులు తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే రూ. 1,17,52,86,402 జరిమానాతో పాటు డిమాండ్ ఆర్డర్ జారీ చేసినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తన ఫైలింగ్‌లో పేర్కొంది. అయితే, అధికారుల ఆదేశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, దీనిపై న్యాయపరంగా తమకు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది. పన్ను నిపుణుల సలహాతో ఈ ఆదేశాలను ఉన్నత అధికారిక ఫోరంలో సవాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ జరిమానా ప్రభావం కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలపై పెద్దగా ఉండబోదని కూడా వివరించింది. ఈ వార్తల నేపథ్యంలో ఇంట్రా-డే ట్రేడింగ్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు ధర రూ.95 (1.64%) మేర తగ్గింది. మరోవైపు ఇవాళ ఉదయం కువైట్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దాన్ని ముంబైకి మళ్లించిన విషయం తెలిసిందే.

## సంచార్ సాథీపై ప్రతిపక్షాల ఆందోళన

**మీ ఇష్టం.. డిలీట్ చేసుకోవచ్చు: కేంద్రం**

న్యూఢిల్లీ: కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చే మొబైల్ ఫోన్లలో కచ్చితంగా సంచార్ సాథీ యాప్ ఉండాలని మొబైల్ తయారీ కంపెనీలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ నిర్ణయంపై ప్రతి పక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో.. మొబైల్‌లో సంచార్ సాథీ యాప్ తప్పనిసరేం కాదని కేంద్రం వివరణ ఇచ్చింది. 'మీ ఇష్టం ఉంటే ఉంచుకోవచ్చని వద్దనుకుంటే డిలీట్ చేసుకోవచ్చు' అని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు సైబర్ సెక్యూరిటీ పెంచేందుకు కేంద్రం సంచార్ సాథీ పేరిట ఓ యాప్ ప్రవేశపెట్టింది. సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేందుకు కొత్తగా విక్రయించే ప్రతి స్మార్ట్ ఫోన్ లో ఈ సంచార్ సాథీ యాప్ డీఫాల్ట్ గా ఇన్ స్టాల్ చేయాలని కేంద్రం ఆయా కంపెనీలను కోరింది. ఈ మేరకు టెలికాం మంత్రిత్వ శాఖ అన్ని ప్రైవేటు మొబైల్ తయారీ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం అమలుకు 90 రోజుల గడువు కూడా విధించింది. ఆ తర్వాత వచ్చే ఫోన్లలో సంచార్ సాథీ యాప్ తప్పనిసరిగా కనిపించాలని తెలిపింది. అంటే మొబైల్ లో సంచార్ సాథీ యాప్ కనిపించేలా ఉండాలి. వినియోగించుకోడానికి అనువుగా ఉండాలి. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ డిజేబుల్ చేయడానికి వీల్లేదు. అయితే కేంద్రం నిర్ణయం కొందరికి ఆమోద యోగ్యం కాగా, చాలా మందికి ఇబ్బందిగా మారింది.



## పొట్టిగా ఉన్నాడని సీటివ్వలేదు!

**న్యాయపోరాటంచేసి డాక్టరయ్యాడు**

**ప్రభుత్వ వైద్యుడిగా ప్రజలకు వైద్య సేవలు**

వడోదర: శరీరానికి అంగవైకల్యం అడ్డుకాదని, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు డాక్టర్ గణేశ్ బరయ్యా. కేవలం మూడడుగుల ఎత్తు మాత్రమే ఉన్న అతడు, వైద్యుడిగా సేవలందించాలన్న తన కలను న్యాయపోరాటం చేసి మరీ నెరవేర్చుకున్నాడు. ఎన్నో అవమానాలు, తిరస్కరణలు ఎదురైనా వెనకడుగు వేయకుండా, నేడు ప్రభుత్వ వైద్యుడిగా ప్రజలకు సేవ చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాడు. గుజరాత్‌కు చెందిన గణేశ్ 2004లో గ్రోత్ హార్మోన్ లోపంతో జన్మించాడు. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని కలలు కన్నాడు. నీట్ పరీక్షలో మంచి మార్కులు సాధించినప్పటికీ, అతడి ఎత్తు కేవలం 3 అడుగులు మాత్రమే ఉండటంతో భారత వైద్య మండలి (ఎంసీఐ) ఎంబీబీఎస్ అడ్మిషన్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఎంసీఐ నిర్ణయాన్ని సవాలు చేస్తూ గణేశ్ మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. అక్కడ అతడికి నిరాశే ఎదురైంది. అయినా పట్టువదలకుండా, సుప్రీంకోర్టు తలుపు తట్టాడు. గణేశ్ పట్టుదలను, ప్రతిభను గుర్తించిన సర్వోన్నత న్యాయస్థానం, అనుకూలంగా తీర్పు ఇచ్చింది. దీంతో అతడి వైద్య విద్యకు మార్గం సుగమమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో 2019లో భావ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో గణేశ్ ఎంబీబీఎస్ సీటు పొందాడు. విజయవంతంగా కోర్సు పూర్తి చేసి, ప్రస్తుతం ప్రభుత్వ వైద్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తన లక్ష్యాన్ని చేరుకున్నారు.

## భారత్ బలం వల్లే మోదీ మాటకు విలువ: ఆరెస్సెస్ చీఫ్


పూణె: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడినప్పుడు ప్రపంచ దేశాల నేతలు ఎంతో శ్రద్ధగా వింటున్నారని, దీనికి కారణం అంతర్జాతీయ వేదికపై భారత్ బలం, సత్తా ప్రదర్శితం కావడమేనని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. భారత్‌కు దక్కాల్సిన సరైన స్థానం ఇప్పుడు లభిస్తోందని, అందుకే ప్రపంచం మన దేశాన్ని గమనిస్తోందని ఆయన పేర్కొన్నారు. పూణెలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవత్ ప్రసంగించారు. భారత్ అభివృద్ధి పథంలో పయనిస్తే ప్రపంచ సమస్యలు పరిష్కారమవుతాయని, ఘర్షణలు తగ్గి శాంతి నెలకొంటుందని విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు కూడా భారత్ నుంచి ఇదే ఆశిస్తున్నాయని ఆయన తెలిపారు. సంఘ్ స్థాపించి వందేళ్లు పూర్తయినప్పటికీ, సమాజాన్ని ఏకం చేసే పనిలో ఇంత జాప్యం ఎందుకు జరిగిందనే దానిపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని భగవత్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, తొలితరం కార్యకర్తల త్యాగాల వల్లే సంఘ్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకుందని గుర్తుచేశారు. తాము ఆలస్యంగా రాలేదని, తమ మాట వినడం మీరే ఆలస్యం చేశారని ఒక సందర్భంలో తాను చెప్పినట్లు భగవత్ గుర్తు చేసుకున్నారు. "వైవిధ్యంలో ఏకత్వమే మన పునాది. ధర్మం ఆధారంగా మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి" అని ఆయన పిలుపునిచ్చారు.



## సరిహద్దుల్లో 120 మంది పాక్ ఉగ్రవాదులు: బీఎస్ఎఫ్

శ్రీనగర్: 'ఆపరేషన్ సిందూర్' లో పాకిస్థాన్ సరిహద్దుల్లోని ఉగ్రవాద స్థావరాలను భారత సైన్యం తుడిచిపెట్టిన విషయం విదితమే. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న ఈ క్యాంపులను భారత వైమానిక దళం ధ్వంసం చేసింది. వందలాది మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో హతమయ్యారు. అయితే, ఇప్పటికీ ఇంకా ఉగ్రస్థావరాలు మిగిలే ఉన్నాయని, అక్కడ ఉగ్ర కార్యకలాపాలు జరుగుతున్నాయని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఐజీ అశోక్ యాదవ్ వెల్లడించారు. నియంత్రణ రేఖకు ఆవలివైపు ప్రస్తుతం 69 ఉగ్రస్థావరాలు యాక్టివ్ గా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ క్యాంపుల్లో సుమారు 100 నుంచి 120 మంది ఉగ్రవాదులు భారత్ లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. భారత్ లోకి చొరబడేందుకు అవకాశం కోసం చూస్తున్నారని వివరించారు. అయితే, ఉగ్రవాదుల కదలికలను నిరంతరం గమనిస్తున్నామని ఆయన వివరించారు. ఇటీవల ఎనిమిది మంది ఉగ్రవాదులు సరిహద్దులు దాటి భారత్ లోకి అడుగుపెట్టేందుకు విఫలయత్నం చేశారని అశోక్ యాదవ్ చెప్పారు. చొరబాటుకు నాలుగుసార్లు ప్రయత్నించిన ఆ ఎనిమిది మంది ఉగ్రవాదులను బీఎస్ఎఫ్ మట్టుబెట్టిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ లో బీఎస్ఎఫ్ కీలకంగా వ్యవహరించిందని, సరిహద్దుల్లోని పాక్ ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో పాలుపంచుకుందని బీఎస్ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు.

## లస్యారి చిత్రం







## సుడిగాలి సుధీర్ గోట్ టీజర్ రిలీజ్

జైశ్నవ్ ప్రొడక్షన్, మాహాతేజ క్రియేషన్స్ సంయుక్త నిర్మాణంలో మొగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం గోట్. సుడిగాలి సుధీర్, దివ్యభారతి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా క్రికెట్ నేపథ్యంతో కామెడీ ప్రధానంగా రూపొందింది. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి స్పందన లభించగా, తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, టీజర్ లాంచ్ చేసిన దిల్ రాజు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రాన్ని బాధ్యతాయుతంగా రూపొందించామని, మొదట్లో కొన్ని ఆటంకాలు ఎదురైనా, కొత్త టీమ్‌తో తాము అనుకున్న కథను అద్భుతంగా తీర్చిదిద్దామని చెప్పారు. ఈ సినిమా మాస్ ఫన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులకు 'ఫుల్ మీల్స్'లా ఉ ంటుందని, అలాగే సమాజంలోని ఒక సమస్యను కూడా ప్రస్తావించామని ఆయన వివరించారు. ఈ చిత్రం త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు. హీరోయిన్ దివ్యభారతి మాట్లాడుతూ, తమిళంలో 'బ్యాచిలర్' తనకు ఎంత పేరు తెచ్చిందో, తెలుగులో గోట్ అంతటి పేరు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కథ విన్నప్పుడు బాగా నవ్వుకున్నానని, సుధీర్ గారు మల్టీ టాలెంటెడ్ అని, ఆయనతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. విలన్‌గా నటించిన నితిన్ ప్రసన్న మాట్లాడుతూ, కథ, తన పాత్ర చాలా నచ్చాయని, గొప్ప టీమ్ వర్క్‌తో ఈ సినిమా చేశామని తెలిపారు. కో-ప్రొడ్యూసర్ రవీందర్ రెడ్డి ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు.



## ఏపీలో అఖండ 2 టికెట్ రేట్లు పెంపు

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం అఖండ 2 ఈ నెల 5న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. అయితే, ఈ సినిమా టికెట్ రేట్లు పెంచుకునేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ మేరకు తాజాగా ఆదేశాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రాష్ట్రంలో డిసెంబర్ 4న రాత్రి బెనిఫిట్ షోలు వేసుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ బెనిఫిట్ షోకు టికెట్ ధరను రూ.600/- గా ఫిక్స్ చేశారు. ఇక డిసెంబర్ 5 నుండి 10 రోజుల పాటు అఖండ 2 చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్లలో మల్టీప్లెక్స్‌లు రూ.100/-, సింగిల్ స్క్రీన్ థియేటర్లు రూ.75/- చొప్పున టికెట్ రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం అంగీకరించింది. రోజుకు 5 షోలు ప్రదర్శించుకునేందుకు సదరు థియేటర్లకు అనుమతినిచ్చింది ఏపీ సర్కార్. దీంతో 'అఖండ 2' బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ ఓపెనింగ్స్ అందుకోవడం ఖాయమని చిత్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో నటిస్తున్నాడు.

## స్పిరిట్ ఓటీటీ డీల్ 160 కోట్లు?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఇప్పుడు స్పిరిట్ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులు రూ.160 కోట్లకు లాక్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. డీల్ అఫీషియల్‌గానే ముగించుకున్నట్లు రూమర్స్ చక్కర్లు కొడుతున్నాయి. స్పిరిట్ పై ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. ఓవైపు ప్రభాస్ యాక్ట్ చేస్తుండడం.. మరోవైపు సందీప్ వంగా దర్శకత్వం వహిస్తుండడంతో ఓ రేంజ్ లో హెూప్స్ ఉన్నాయి. కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని.. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు క్రియేట్ అవుతాయని అంతా ఫిక్స్ అయిపోయారు. అలాంటి అంచనాలు ఉన్న మూవీకి రూ.160 కోట్లకే ఓటీటీ డీల్ ఖరారు అయిందంటే నమ్మలేకపోతున్నామని కొందరు ఫ్యాన్స్ చెబుతున్నారు. ఓ విధంగా అది కూడా నిజమే.. రీసెంట్ గా వచ్చిన కొన్ని భారీ చిత్రాలకు పెద్ద మొత్తంలో డీల్స్ ఖరారు అయ్యాయి. ఓటీటీ ఒప్పందాలతోనే మేకర్స్‌కు పెద్ద ఎత్తున డబ్బులు వచ్చాయి. ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడీ మూవీ కేవలం హిందీ ఓటీటీ రైట్స్ రూ.170 కోట్లకు పైగా రేట్‌తో అమ్ముడయ్యాయి.






## 'యానిమల్' ఆఫర్ వస్తే నో చెప్పేదాన్ని

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు.

## చిరు, వెంకీ సాంగ్ గ్లింప్స్ అదిరింది!

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు . అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ



'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో వెంకటేశ్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. చిరంజీవి, వెంకటేశ్ కాంబోలో ఓ పాట కూడా ఉండగా షూటింగ్ కొనసాగుతుందంటూ వార్తలు కూడా వచ్చాయి. తాజాగా దీనిపై అధికారిక అప్‌డేట్ వచ్చేసింది. ఈ సాంగ్ గ్లింప్స్ షేర్ చేశారు మేకర్స్. బ్యాక్ డ్రాప్ విజువల్స్ ఫైరింగ్ మోడ్‌లో ఉండగా.. చిరు, వెంకీ కలిసి నడుస్తూ థంబ్స్ అప్ సింబల్ చూపిస్తున్న గ్లింప్స్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. మెగా విక్టరీ మాస్ సాంగ్.. షూటింగ్ కొనసాగుతోంది అంటూ అనిల్ రావిపూడి టీం షేర్ చేసిన అదిరిపోయే సాంగ్ గ్లింప్స్ ఇంట్రో నెట్టింట వైరల్ అవుతూ పాటపై అంచనాలు మరింత పెంచేస్తోంది.

## రాజా సాబ్ రన్ టైం 3.14 గంటలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానుల్లో 'ది రాజా సాబ్' ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకురానుందట. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అమెరికాలోని ప్రముఖ టికెట్ బుకింగ్ వెబ్‌సైట్లలో ఈ సినిమా రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

## మీడియాపై జాన్వీ రుసరుస

బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్ర మరణ వార్తలను కొన్ని మీడియా వర్గాల వారు ప్రముఖంగా ప్రచారం చేశాయి. అందులో ఆయనకి సంబంధించిన కొన్ని తప్పుడు విషయాలను మీడియాలో ప్రముఖంగా ప్రచారం చేశారు అనేది ఇండస్ట్రీ వర్గాల వారి ఆరోపణ. తాజాగా జాన్వీ కపూర్ అదే విషయాన్ని లేవనెత్తింది. తన తల్లి శ్రీదేవి చనిపోయిన సమయంలో తప్పుడు వార్తలతో జనాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు, ఇప్పుడు అదే విధంగా ధర్మేంద్ర గారు చనిపోయిన విషయంలోనూ మీడియా తప్పుడు వార్తలను వండి వడ్డించే ప్రయత్నాలు చేస్తుందని జాన్వీ కపూర్ ఆరోపించింది. ఒకవైపు వ్యక్తి చనిపోయిన బాధలో కుటుంబం ఉ ంటే మరోవైపు మీడియాలో వచ్చిన కథనాలతో వారు తీవ్ర ఆవేదనకి గురవుతున్నారని జాన్వీ తన ఆవేదనని వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా ఎవరికి తోచిన విధంగా వారు చనిపోయిన వారి గురించి మాట్లాడటం ఏమాత్రం కరెక్ట్ కాదని ఆమె సీరియస్ గా కామెంట్ చేసింది. జాన్వీ కపూర్ ఇంకా మాట్లాడుతూ.. నా తొలి సినిమా విడుదల కాకముందే అమ్మ చనిపోయింది. ఆమె గురించి సినిమా ప్రమోషన్ సమయంలో మాట్లాడినా కూడా కొందరు విమర్శించారు. ఆ ట్రోల్స్ నన్ను ఇప్పటికీ వెంటాడుతూనే ఉంటాయి. నేను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందు అమ్మ చనిపోవడంతో ఆమె గురించి ఎప్పటికప్పుడు గుర్తు చేసుకున్నా, దాన్నీ కొందరు తప్పుపడుతూ విమర్శలు చేయడం చాలా బాధగా అనిపించింది' అని ఆవేదన వ్యక్తం చేసింది.



# కోహ్లీ X గంభీర్



## విజయ్ హజారే ట్రోఫీలో ఆడనన్న విరాట్

### రంగంలోకి బీసీసీఐ

**టీమిండియాలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. త్వరలో ప్రారంభం కానున్న దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు కోహ్లీ నిరాకరించడమే ఈ వివాదానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పరిణామం భారత డ్రెస్సింగ్ రూమ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.**

విజయ్ హజారే ట్రోఫీకి అందుబాటులో ఉంటానని ఇప్పటికే రోహిత్ శర్మ బీసీసీఐ సెలక్షన్ కమిటీకి స్పష్టం చేశాడు. అయితే, కోహ్లీ మాత్రం ఈ టోర్నీలో పాల్గొనేందుకు విముఖత చూపుతున్నాడు. ఒకే నిబంధన అందరికీ వర్తిస్తుందని, ఒక ఆటగాడికి మినహాయింపు ఎలా ఇస్తామని, మిగతా వారికి ఏం సమాధానం చెప్పాలని బీసీసీఐ వర్గాలు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. అందుబాటులో ఉన్న ఆటగాళ్లందరూ దేశవాళీ క్రికెట్ ఆడాలనే నిబంధనపై గంభీర్, సెలక్టర్లు మొదట్నుంచీ పట్టుదలగా ఉన్నారు. అయితే, తాను ఎక్కువ సన్నద్ధతను నమ్మనని కోహ్లీ భావిస్తున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డే అనంతరం మాట్లాడుతూ.. 'నేను ఎప్పుడూ ఎక్కువ ప్రిపరేషన్‌ను నమ్మను. నా క్రికెట్ అంతా మానసికమైనది. శారీరకంగా కష్టపడతాను, ఫిట్‌నెస్ స్థాయిలు బాగుంటే చాలు' అని వ్యాఖ్యానించాడు. కోహ్లీ, గంభీర్ మధ్య పెరుగుతున్న అగాధాన్ని పూడ్చేందుకు బీసీసీఐ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా, జాతీయ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజాను రాయ్‌పూర్‌కు పంపినట్లు తెలుస్తోంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య రెండో వన్డే అక్కడే జరగనుండగా, ఈ సందర్భంగా ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఓజా ప్రయత్నించనున్నాడు.



## వైభవ్ సూర్యవంశీ.. 12 ఏళ్ల రికార్డ్ బద్దలు!

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంచరీ బాదిన అత్యంత పిన్నవయస్కుడిగా నిలిచాడు. ఈ ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీలో బీహార్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వైభవ్ సూర్యవంశీ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగాడు. ఈ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో విఫలమైన సూర్యవంశీ.. నాలుగో మ్యాచ్‌లో 61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులతో 108 పరుగులు చేశాడు. ఈ సెంచరీతో సూర్యవంశీ 12 ఏళ్ల రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. 2013లో మహారాష్ట్ర బ్యాటర్ విజయ్ జోల్ 18 ఏళ్ల 118 రోజుల వయసులో (109) సెంచరీ చేసి అతిపిన్నవయస్కుడిగా నిలిచాడు. ఇన్నాళ్లు చెక్కు చెదరకుండా ఉన్న ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టాడు. 14 ఏళ్ల 250 రోజుల వయసులో సూర్యవంశీ 108 పరుగులు చేసి ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో వైభవ్ సూర్యవంశీ తర్వాత ఆయుష్ మాత్రే(18 ఏళ్ల 135 రోజులు), ఆయుష్ మాత్రే(18 ఏళ్ల 137 రోజులు), షేక్ రషీద్(19 ఏళ్ల 25 రోజులు) ఉన్నారు. భారత్ తరపున టీ20ల్లో మూడు సెంచరీలు నమోదు చేసిన అత్యంత పిన్నవయస్కుడిగా కూడా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. ఈ క్రమంలో తిలక్ వర్మ పేరిట ఉన్న రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ల 250 రోజుల వయసులో ఈ ఫీట్ అందుకుంటే తిలక్ వర్మ(22 ఏళ్ల 7 రోజుల వయసు), దేవదత్ పడిక్కల్(22 ఏళ్ల 96 రోజులు), యశస్వి జైస్వాల్(22 ఏళ్ల 126 రోజులు), అహ్మద్ షేహ్‌జాద్(22 ఏళ్ల 127 రోజులు), ఉన్ముక్త్ చంద్(22 ఏళ్ల, 295 రోజులు) తర్వాత ఉన్నారు.



## అభిషేక్ శర్మ.. పోలార్డ్ రికార్డ్ బద్దలు!

టీమిండియా స్టార్ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో 19 బంతుల్లోపు 7 హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీలో భాగంగా ఉప్పల్ వేదికగా బరోడాతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ తరఫున 18 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 50 పరుగులు చేసి లింబానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. గత ఆదివారం బరోడాతో జింఖాన మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ భారీ శతకంతో చెలరేగాడు. 52 బంతుల్లో 148 పరుగులు చేశాడు. అదే జోరును తాజా మ్యాచ్‌లోనూ చూపించాడు. టీ20ల్లో అభిషేక్ శర్మకు 19 బంతుల్లోపు ఇది ఏడో హాఫ్ సెంచరీ. అయితే ఇందులో మూడు హాఫ్ సెంచరీ పంజాబ్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోపీలోనే నమోదు కాగా.. మరో మూడు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున వచ్చాయి.

## రెజ్లర్స్‌కు షాక్.. పిటిషన్లు కొట్టివేత

ఢిల్లీ హైకోర్టులో అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్, సత్యవర్త్ కడియన్‌లకు ఎదురుదెబ్బ తగిలింది. భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలను సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. రెజ్లర్లు కోర్టు ఎదుట హాజరుకాకపోవడంతో.. హైకోర్టు పిటిషన్లను కొట్టివేసింది. సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష ఎన్నికల్లో అనితా షియోరన్‌పై గెలుపొందారు. అనితకు రెజ్లర్ల మద్దతు తెలిపారు. నవంబర్ 27న ఈ కేసును విచారించిన జస్టిస్ మినీ పుష్కర్ణ విచారణ సమయంలో పిటిషనర్లు ఎవరూ కోర్టుకు రాకపోవడాన్ని గమనించారు.











## రాయ్‌పూర్‌కు చేరిన టీమిండియా

### కోహ్లీకి చిన్నారుల ఘన స్వాగతం

### నేడే సౌతాఫ్రికాతో మూడో వన్డే

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో విజయం సాధించిన ఉత్సాహంతో ఉన్న టీమిండియా, బుధవారం నాటి రెండో మ్యాచ్ కోసం రాయ్‌పూర్‌కు చేరుకుంది. అక్కడ భారత ఆటగాళ్లకు, ముఖ్యంగా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి అభిమానుల నుంచి ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయం నుంచి హోటల్‌కు చేరుకున్న కోహ్లీని చూసిన చిన్నారులు ఆనందంతో చుట్టుముట్టారు. గులాబీ పువ్వులు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాంచీ వేదికగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో భారత్ 17 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, మరో సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరిద్దరి ప్రదర్శనతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా గట్టిగా పోరాడినప్పటికీ, భారత బౌలర్లు కట్టడి చేయడంతో విజయం టీమిండియాను వరించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు స్వదేశంలో జరిగిన టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికాకు కోల్పోయిన నేపథ్యంలో వన్డే సిరీస్‌ను విజయంతో ప్రారంభించడం జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇప్పుడు అందరి దృష్టి రాయ్‌పూర్‌లో జరగనున్న రెండో వన్డేపైనే ఉంది.



## హార్దిక్ విధ్వంసం!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దుమ్మురేపాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు సన్నాహకంగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడుతున్న హార్దిక్ పాండ్యా తన తొలి మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 77 పరుగులతో అజేయంగా నిలిచి తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. ఆసియా కప్ 2025 సందర్భంగా గాయపడ్డ హార్దిక్ పాండ్యా.. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనతో పాటు సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్న అతను మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగాడు. పంజాబ్‌తో మంగళవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో బరోడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. హార్దిక్ విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో బరోడా 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

## మహిళల హాకీ చీఫ్ కోచ్ రాజీనామా

భారత మహిళల హాకీ టీమ్ హెడ్ కోచ్ హరేంద్ర సింగ్ తన పదవికి రాజీనామా చేశాడు. వ్యక్తిగత కారణాలతో హరేంద్ర సింగ్ తప్పుకున్నట్లు హాకీ ఇండియా(హెచ్ఐ) ప్రకటించింది. అంతర్జాతీయ క్వాలిఫైయర్స్‌కు సన్నదమవుతున్న క్రమంలో ఈ ఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది. వ్యక్తిగత కారణాలతోనే హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు హరేంద్ర సింగ్ మీడియాకు తెలిపారు. 'భారత మహిళల హాకీ టీమ్‌కు కోచ్‌గా పనిచేయడం నా జీవితంలోనే అద్భుతమైన ఘట్టం. వ్యక్తిగత కారణాలతో తప్పుకున్నా.. నా హృదయం ఎప్పుడూ అమ్మాయిల జట్టుతోనే ఉంటుంది. వారి విజయాల కోసం పరితపిస్తోంది. హాకీ ఇండియాతో నా ప్రయాణాన్ని ఎప్పుడూ ఆరాదిస్తాను. భారత హాకీని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి వారు చేస్తున్న ప్రయత్నాలకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది.'అని ఆయన పేర్కొన్నారు. హరేంద్ర సింగ్ ప్రవర్తనపై జట్టులోని ఆటగాళ్లు అసంతృప్తిగా ఉన్నారని, ఉన్నతాధికారులతో పాటు క్రీడా మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.




## విమర్శలను పట్టించుకోను

ఇటీవల సోషల్ మీడియాలో ట్రోలింగ్ బాధితుడు ఎవరంటే హర్షిత్ రాణా అని ఠక్కున చెప్పేస్తారు ఎవరైనా. 'టాలెంట్ లేదు.. అనవసరంగా కొనసాగిస్తున్నారు? గౌతం గంభీర్ శిష్యుడు కాబట్టే అవకాశాలు'.. ఇలాంటి తీవ్రమైన విమర్శలు ఎదుర్కొన్నాడీ పేసర్. ట్రోలింగ్‌ను మౌనంగా భరిస్తూనే మైదానంలో అదరగొడుతున్నాడు రానా. తాజాగా రాంచీ వన్‌లో తొలి ఓవర్లోనే రెండు వికెట్లతో మ్యాచ్‌ను మలుపుతిప్పాడీ స్పీడ్‌స్టర్. తన బౌలింగ్ ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్న ఈ పేసర్.. ఆన్‌లైన్‌లో తనపై వస్తున్న ట్రోలింగ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నేను విమర్శలను పెద్దగా పట్టించుకోను.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
బుధవారం 3-12-2025 | www.evarthalu.com

# సాగు.. సవాళ్లు.. సంస్కరణలు



**భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముక వంటిది, ఇప్పటికీ దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలకు ఉపాధి, ఆదాయ వనరులను అందిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి, హరిత విప్లవం, శ్వేత విప్లవం వంటి విప్లవాత్మక విధానాల ద్వారా ఆహార భద్రతలో స్వయం సమృద్ధి సాధించబడింది. అయితే, నేటికీ ఈ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది, పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవాలంటే సమూలమైన సంస్కరణలు, ప్రభుత్వ జోక్యం అవసరం.**

ప్రస్తుత వ్యవసాయ విధానం ఉత్పత్తిని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, రైతుల జీవనోపాధిని పెంపొందించడంపై దృష్టి పెట్టింది. అయితే, ఈ విధానాలు ఆశించిన ఫలితాలను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నాయి. కారణాలు అనేకం. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారతదేశంలో హెక్టారుకు సగటు దిగుబడి చాలా తక్కువగా ఉంది. చాలా మంది రైతులు 2 హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉండటం వలన ఆధునిక యంత్రాలను ఉపయోగించడం, తగినంత ఆదాయాన్ని పొందడం కష్టమవుతుంది. నీటిపారుదల సౌకర్యాలు, కోల్డ్ స్టోరేజీలు, రవాణా మౌలిక సదుపాయాలు సరిపోవు, దీనివల్ల పంట నష్టాలు, మార్కెటింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. రుతుపవనాలపై అధిక ఆధారపడటం, ప్రకృతి వైపరీత్యాలు పంట వైఫల్యాలకు దారితీస్తున్నాయి. రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలను పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు, మధ్యవర్తుల పాత్ర అధికంగా ఉంది. వ్యవసాయ రంగంలో స్థిరమైన వృద్ధిని, రైతుల ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వాలు తక్షణమే దృష్టి సారించాల్సిన కొన్ని కీలక సంస్కరణలు, నిర్ణయాలు అవసరం. ప్రధాన మంత్రి కృషి



యోజన వంటి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తూ, నీటిపారుదల ప్రాజెక్టులలో భారీ పెట్టుబడులు పెట్టాలి. ప్రతి పొలానికి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. చిన్న, చిన్న భూ కమతాలను ఏకీకృతం చేయడానికి లేదా సహకార వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి విధానాలను రూపొందించాలి, ఇది యాంత్రీకరణ, వనరుల సమర్థవంతమైన నిర్వహణకు సహాయపడుతుంది. కృత్రిమ మేధస్సు, డ్రోన్లు, ఐవోటీ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను వ్యవసాయంలో విరివిగా ఉపయోగించేలా ప్రోత్సహించాలి. పంట ఆరోగ్యం, నేల నాణ్యత, వాతావరణ అంచనాలపై రైతులకు సలహాలు ఇవ్వడానికి ఈ-ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయాలి. పంట కోత అనంతర నష్టాలను తగ్గించడానికి కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా మార్కెట్లకు తరలించడానికి రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి. వరి, గోధుమ వంటి సాంప్రదాయ పంటలపై ఆధారపడటాన్ని తగ్గించి, అధిక విలువ కలిగిన పండ్లు, కూరగాయలు, నూనెగింజలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలి. పరంపరగత్ కృషి వికాస్ యోజన వంటి పథకాల ద్వారా సేంద్రీయ, పర్యావరణ అనుకూల సాగు విధానాలను ప్రోత్సహించాలి. రైతులకు తక్కువ వడ్డీ రేటుతో సులభంగా రుణాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పంటల బీమా పథకాలు పారదర్శకంగా, సకాలంలో నష్టపరిహారం అందించేలా సంస్కరణలు చేపట్టాలి. వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలి. రైతులు తమ ఉత్పత్తులను దేశంలోని ఏ మార్కెట్లోనైనా అమ్ముకునే స్వేచ్ఛ, సౌకర్యం కల్పించాలి. వ్యవసాయ పరిశోధన, అభివృద్ధిలో పెట్టుబడులను పెంచాలి. వాతావరణ మార్పులను తట్టుకోగల అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అభివృద్ధి చేయాలి. చివరగా, భారతదేశ వ్యవసాయ రంగ సవాళ్లను అధిగమించడానికి సమగ్రమైన, సమీకృత విధానం అవసరం. అన్ని అనుబంధ రంగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఈ సంస్కరణలను అమలు చేస్తే, వ్యవసాయం కేవలం జీవనోపాధి మార్గంగా కాకుండా, దేశ ఆర్థిక వృద్ధికి కీలక చోదక శక్తిగా మారుతుంది.



గంగాధర్

# ఒక భోపాల్.. ఒక సిగాచీ!

**భారతదేశ పారిశ్రామిక చరిత్రలో భోపాల్ గ్యాస్ విషాదం (1984) ఒక చేదు జ్ఞాపకం. వేల మంది ప్రాణాలను బలిగొన్న ఆ చీకటి అధ్యాయం తర్వాత పారిశ్రామిక భద్రత, కార్పొరేట్ బాధ్యత, ప్రభుత్వ పర్యవేక్షణపై అనేక చట్టాలు, నిబంధనలు రూపొందాయి. అయితే, సరిగ్గా నాలుగు దశాబ్దాల తర్వాత, తెలంగాణలోని సిగాచీ ఇండస్ట్రీస్‌లో జరిగిన పేలుడు (2025 జూన్) మరోసారి అదే ప్రశ్నలను, అదే నిర్లక్ష్యాన్ని కళ్లముందు నిలిపింది. ఈ రెండు దుర్ఘటనలు ప్రభుత్వాలు, పారిశ్రామిక రంగం ఇంకా పూర్తి స్థాయిలో గుణపాఠం నేర్చుకోలేదన్న చేదు నిజాన్ని వెల్లడిస్తున్నాయి.**

భోపాల్, సిగాచీ ప్రమాదాల మధ్య దశాబ్దాల కాల వ్యవధి ఉన్నప్పటికీ, వాటి మూల కారణాలలో ఆశ్చర్యకరమైన సారూప్యతలు కనిపిస్తాయి. భోపాల్‌లో ఖర్చులను తగ్గించుకునేందుకు కీలకమైన భద్రతా వ్యవస్థలు మూసివేయబడ్డాయి. సిగాచీ విషయంలోనూ, ఫ్యాక్టరీల శాఖ తనిఖీ నివేదికలో 'తీవ్రమైన భద్రతా ఉల్లంఘనలు', ప్రాథమిక అగ్నిమాపక భద్రతా వ్యవస్థలు లేవని ఆరు నెలల ముందే గుర్తించారు. రెండు సందర్భాల్లోనూ, ప్రభుత్వ నియంత్రణ సంస్థల పర్యవేక్షణ లోపించింది. భోపాల్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్లు ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోలేకపోయారు. అవినీతి కారణంగా నిబంధనలను పట్టించుకోలేదు. సిగాచీలో లోపాలను గుర్తించినప్పటికీ, తదుపరి చర్యలు, నివారణ పర్యవేక్షణ జరగలేదు. భోపాల్ లీక్ సమయంలో అత్యవసర ప్రణాళికలు సరిగా లేవు, బాధితులకు ఎలాంటి చికిత్స అందించాలో వైద్య సిబ్బందికి తెలియదు. సిగాచీ పేలుడు తర్వాత కూడా, బాధితులకు సకాలంలో, నాణ్యమైన వైద్యం అందలేదని, పరిహారం చెల్లింపులో జాప్యం జరిగిందని విమర్శలు వచ్చాయి. రెండు కంపెనీలు (యూనియన్ కార్బైడ్, సిగాచీ) తొలుత తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యాయి. చట్టపరమైన ప్రక్రియలు, పరిహారం చెల్లింపులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ సారూప్యతలు మనకు తెలిపేదేమిటంటే, భోపాల్ తర్వాత వచ్చిన పర్యావరణ పరిరక్షణ చట్టం (1986), పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ చట్టం (1991) వంటి కఠిన చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్రమైన లోపాలున్నాయి. చట్టాలు చేయడం ఒక ఎత్తు, వాటిని పటిష్టంగా అమలు చేయడం మరొక ఎత్తు. చట్టాల అమలులో భాగంగా తనిఖీ వ్యవస్థలను బలోపేతం చేయాలి. లోపాలు గుర్తించినప్పుడు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి, జరిమానాలు విధించాలి, అవసరమైతే కార్యకలాపాలను నిలిపివేయాలి. ప్రమాదకర పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు, స్థానిక అధికారులకు పూర్తి సమాచారం, ప్రమాదాల గురించిన అవగాహన ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలనే దానిపై స్థానిక సమాజానికి శిక్షణ ఇవ్వాలి. నివాస ప్రాంతాలకు, పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాలకు దూరంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించే క్రమంలో భద్రతా ప్రమాణాలను విస్మరించకూడదు. తనిఖీ అధికారులు, అత్యవసర ప్రతిస్పందన బృందాలకు రసాయన భద్రత, ప్రమాద నిర్వహణపై నిరంతర శిక్షణ, అత్యాధునిక పరికరాలను అందించాలి. ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై క్రిమినల్ బాధ్యతతో సహా కఠిన చర్యలు తీసుకోవాలి. కంపెనీలు తమ నేరాలకు శిక్ష అనుభవించేలా న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలి. ప్రభుత్వం నియమించిన స్వతంత్ర సంస్థల ద్వారా (థర్డ్-పార్టీ ఆడిట్‌లు) క్రమం తప్పకుండా భద్రతా ఆడిట్‌లు నిర్వహించాలి. ఈ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి. రసాయన పరిశ్రమలు తప్పనిసరిగా పటిష్టమైన పీఎస్ఎం వ్యవస్థలను అమలు చేయాలి. ఇందులో ప్రమాద విశ్లేషణ, నిర్వహణ, అత్యవసర ప్రణాళికలు, ఉద్యోగుల శిక్షణ వంటివి అంతర్భాగంగా ఉండాలి. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ యాక్టు సక్రమంగా అమలు జరిగేలా చూడాలి. బాధితులకు తక్షణ, తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. పరిహారం



చెల్లింపులో జాప్యం చేసే సంస్థలపై కఠిన చర్యలుండాలి. దేశవ్యాప్తంగా జరిగిన అన్ని పారిశ్రామిక ప్రమాదాలకు సంబంధించిన కేంద్ర డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలి. ప్రతి ప్రమాదం నుండి నేర్చుకున్న పాఠాలను ఇతర పరిశ్రమలతో పంచుకోవాలి, తద్వారా నివారణ చర్యలు చేపట్టే వీలు కలుగుతుంది. అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించాలి. నిర్లక్ష్యం వహించే సంస్థలకు భారీ జరిమానాలు, లైసెన్స్ రద్దు వంటి కఠిన శిక్షలు విధించాలి. భోపాల్, సిగాచీ విషాదాలు భారత పారిశ్రామిక భద్రతా వ్యవస్థలోని లోపాలకు అద్దం పడుతున్నాయి. భోపాల్ తర్వాత మనం మేల్కొన్నాం అనుకున్నప్పటికీ, సిగాచీ వంటి ఘటనలు ఆ మేల్కొలుపు తాత్కాలికమేనని నిరూపించాయి. కేవలం చట్టాలు చేస్తే సరిపోదు, వాటిని ఆత్మసాక్షిగా, పారదర్శకంగా అమలు చేయాలి. మానవ ప్రాణాల విలువ కంటే లాభం ఎప్పుడూ ఎక్కువ కాదు. ప్రభుత్వాలు తమ నియంత్రణ వ్యవస్థలను పటిష్టం చేసి, కార్పొరేట్ సంస్థలు తమ నైతిక బాధ్యతలను గుర్తించి, సుస్థిరమైన, సురక్షితమైన పారిశ్రామిక వాతావరణాన్ని నిర్మించాలి. భవిష్యత్తులో మరో భోపాల్ లేదా మరో సిగాచీ జరగకుండా చూడటం మన సామాజిక, నైతిక బాధ్యత అని ప్రభుత్వాలు, పరిశ్రమలు తెలుసుకోవాలి.

**- మన్యు విహాన్, పర్యావరణవేత్త**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY BOMMAKANTI SHRAVAN KUMAR, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: BOMMAKANTI SHRAVAN KUMAR, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.